

www.vibharenews.com

# విభారె

తెలుగు దినపత్రిక

VIBHARE TELUGU DAILY

PUBLISHED FROM KURNOOL    ఎడిటర్ : ఆవుల విజయ భాస్కర రెడ్డి    శుక్రవారం 16 ఏప్రిల్ 2021 సంపుటి : 02    సంచిక : 277 పేజీలు : 4    వెల : రూ 3-00

## ముగిసిన తిరుపతి ఉప ఎన్నికల ప్రచారం

తిరుపతి తిరుపతి పార్లమెంట్ స్థానానికి జరగనున్న ఉప ఎన్నికల ప్రచారం గురువారం సాయంత్రం ఐదు గంటలకు ముగిసింది. ప్రచారానికి వచ్చిన ఇతర ప్రాంతాల నేతలు సాయంత్రం వెళ్లి పోవాలని అధికారులు సూచించారు. మూడు వారాల పాటు సాగిన ప్రచారం ముగియడంతో ఇక పోలింగ్ ఏర్పాట్లకు అధికారులు సిద్దమయ్యారు. ఈ నెల 17 వ తేదీ ఉదయం 7 నుంచి సాయంత్రం 7 వరకు పోలింగ్ జరగనుంది. కోవిడ్ తీవ్రత కారణం గా పోలింగ్ సమయం పెంచారు. ప్రతిపక్ష పార్టీ ల నుంచి అగ్రనేతలు ప్రచారం లో పాల్గొన్నారు. అధికార వైసీపీ నుంచి మంత్రులు, ఎమ్మెల్యేలు ప్రచార బాధ్యతలు తీసుకుని పర్యటనలు చేసారు. ఏడు అసెంబ్లీ నియోజకవర్గాలలో చంద్రబాబు నాయుడు రోడ్ షోలు, సభలు నిర్వహించారు. జనసేన, బీజేపీ ల ఉమ్మడి అభ్యర్థి కోసం బీజేపీ నుంచి నడ్డా, జనసేన నుంచి పవన్ ప్రచారం చేసారు. నెల రోజులుగా తిరుపతి లోనే మకాం వేసిన సోము వీర్రాజు, ఇతర నేతలు అభ్యర్ది రత్నప్రభ విజయం కోసం అన్ని వర్గాలను కలిసారు.

# ఆ లక్ష్యాన్ని సాధించాం: సీఎం వైఎస్ జగన్

### ఫోన్ చేస్తే 3 గంటల్లోగా బెడ్ కేటాయించాలి

### రోజుకు 6 లక్షల వాక్సిన్లు ఇచ్చే లక్ష్యంతో పని చేయాలి

### కోవిడ్ నివారణ, కరోనా వాక్సినేషన్‌పై సీఎం జగన్ సమీక్ష





అమరావతి: బుధవారం ఒక్కరోజే రికార్డు స్థాయిలో 6.21 లక్షల వ్యాక్సిన్లు ఇచ్చామని ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అన్నారు. గ్రామ, వార్డు సచివాలయాల సిబ్బంది, పీహెచ్‌సీల సిబ్బంది అందరూ సమష్టిగా పని చేయడం వల్లే ఇది సాధ్యమైందన్నారు. రోజుకు 6 లక్షల వాక్సిన్లు ఇవ్వాలన్న లక్ష్యాన్ని సాధించామని, ఇక ముందు కూడా అలాగే చేయాలని పేర్కొన్నారు. ప్రస్తుతం వాక్సిన్లు లేనందున వాటి కోసం లేఖ రాయమని అధికారులకు సూచించారు. అవసరం అనుకుంటే తాను కూడా లేఖ రాస్తానని చెప్పారు. కోవిడ్ నివారణ, కరోనా వాక్సిన్‌పై క్యాంప్ కార్యాలయంలో సీఎం వైఎస్ జగన్ ఉన్నతస్థాయి సమీక్ష జరిపారు. ఇవాల్టి నుంచి 104 కాల్ సెంటర్‌పై పెద్ద ఎత్తున ప్రచార కార్యక్రమం నిర్వహించాలి. ఎవరికైనా చికిత్స, బెడ్ కావాలంటే ఆ కాల్ సెంటర్ ద్వారా సేవలందించాలి. హోం ఐసోలేషన్, కోవిడ్ కేర్ సెంటర్ లేదా ఆస్పత్రిలో చేర్చడానికి వైద్యుల సూచనల మేరకు సేవలందించాలి. అంబులెన్సు సదుపాయం ఏర్పాటు చేయడంతో పాటు, ఆశా వర్కర్లు, ఏఎన్‌ఎంల సహాయంతో రోగికి వేగంగా వైద్య సేవలందించాలి. హోం ఐసొలేషన్‌లో కూడా వారిని ఫాలో అప్ చేయాలి. రోగి ఫోన్ చేసిన 3 గంటల్లోగా ఆస్పత్రిలో బెడ్ సమకూర్చాలి. 104 నెంబరు కోవిడ్ సేవల కోసం, 1902 నెంబరు గ్రీవెన్సుల కోసం కేటాయించండి. ఈ రెండింటినీ విస్తృతంగా ప్రచారం చేయండి. కోవిడ్‌కు సంబంధించిన ఏ సందేహం ఉన్నా 104కు ఫోన్ చేయాలని బాగా ప్రచారం చేయండి. దీన్ని కూడా ఇవాళ్టి నుంచి ప్రచారంలో చేర్చండి. అందుకు అవసరమైన ఫ్లెక్సీలు, హోర్డింగ్‌లను బస్టాండ్ వంటి పబ్లిక్ ప్లేసెస్‌లో పెద్ద ఎత్తున ఏర్పాటు చేయండి. కోవిడ్ పరీక్ష మొదలు.. వైద్యం, ఆస్పత్రులలో మెడిసిన్, శానిటేషన్, క్వాలిటీ ఆఫ్ ఫుడ్ వరకు.. ఏ మాత్రం రాజీ పడొద్దు. ఎక్కడా రోగులు ఇబ్బంది పడకుండా చూడాలి. ఒకవేళ రోగి ప్రైవేటు ఆస్పత్రిలో చేరాలనుకుంటే, ఎక్కువ ఛార్జీలు వసూలు చేయకుండా, వాటిని కూడా స్పష్టంగా నిర్దేశించండి. రోగులకు ఎక్కడా బెడ్ల కొరత ఉండకూడదు. అందువల్ల ఆరోగ్యశ్రీ జాబితాలో ఉన్న ఆస్పత్రులతో పాటు, ప్రైవేటు ఆస్పత్రుల్లో అందుబాటులో ఉన్న బెడ్ల వివరాలు కూడా అధికారుల దగ్గర ఉండాలి. ఆస్పత్రులలో చికిత్స ఫీజులు, ఛార్జీలకు సంబంధించిన వివరాలను రోగులకు అర్థమయ్యేలా ప్రదర్శించాలి. అలాగే బోర్డులపై ప్రదర్శించిన దాని కంటే ఎక్కువ వసూలు చేస్తే, ఎవరికి ఫిర్యాదు చేయాలో కూడా ప్రజలకు (రోగులకు) తెలిసేలా అన్ని వివరాలు ప్రదర్శించాలి. ఎక్కడా రోగి దోపిడికి గురి కాకుండా ఉండేలా.. అవసరమైన ఔషధాలు, ట్యాబ్లెట్లు, ఇంజెక్షన్ల రేట్లు కూడా స్పష్టంగా ప్రదర్శించాలి. ఎక్కడైనా అధిక ఫీజులు, ఛార్జీలు వసూలు చేస్తే, కఠిన చర్యలు తీసుకోవాలి. ఆస్పత్రి కేర్, శానిటేషన్, నాణ్యమైన ఆహారం.. ఈ మూడు ప్రమాణాలు కోవిడ్ ఆస్పత్రులతో సహా, అన్ని ఆస్పత్రులలో ఉండేలా చూడాలి. క్వాలిటీ ఆఫ్ మెడికేషన్‌తో పాటు, సమయానికి మందులు అందించడం అన్నది కూడా చాలా ముఖ్యం. అన్ని ఆస్పత్రులలో ఇవన్నీ పర్‌ఫెక్ట్‌గా జరగాలి. అందుకోసం ఆస్పత్రులలో వాటిని పరిశీలించడానికి గతంలో మాదిరిగా కొందరు అధికారులకు బాధ్యతలు అప్పగించాలి. జిల్లాలలో కూడా ఆ ఏర్పాటు జరగాలి. టెస్టింగ్ చాలా ముఖ్యం. కోవిడ్ పేషెంట్ ప్రైమరీ కాంటాక్టులందరికీ పరీక్షలు చేయాలి. అదే విధంగా ప్రాథమిక ఆరోగ్య కేంద్రం (పీహెచ్‌సీ)లో కూడా పరీక్షలు చేయాలి. పరీక్ష చేయించాలనుకున్న ఎవరైనా వెళ్లి, దాన్ని చేసుకునే విధంగా ప్రతి పీహెచ్‌సీలో తగిన ఏర్పాటు చేయాలి. ఇంకా 104కు ఎవరైనా ఫోన్ చేసి, తాము పరీక్ష చేయించుకోవాలని అనుకుంటున్నామని చెబితే, వారు ఎక్కడికి పోవాలన్నది గైడ్ చేయాలి. అందువల్ల పీహెచ్‌సీ, సబ్ సెంటర్ లేదా విలేజ్ క్లినిక్.. ఎక్కడైనా సరే పరీక్ష (అది కావాలని కోరుకునే వారికి.. తమకు కోవిడ్ వచ్చిందని భావించే వారికి) చేయించుకునే విధంగా ఏర్పాట్లు చేయాలి. మన ఫోకస్ ఏరియా వాక్సినేషన్. వీలైనంత త్వరగా ఈ ప్రక్రియ ముగించాలి. ఒక పద్ధతి ప్రకారం, ప్రణాళికా బద్ధంగా చేయాలి. రాష్ట్రంలో 45 ఏళ్లు దాటిన ప్రతి ఒక్కరికి వ్యాక్సిన్ వేయాలి. వాక్సిన్ వేయడం మనకు చాలా ముఖ్యం. హెల్త్‌కేర్ వర్కర్లు, ఫ్రంట్‌లైన్ వర్కర్లందరికీ తప్పనిసరిగా వాక్సిన్ వేయాలి. ఒక్కరు కూడా మిగలొద్దు. మనం పెట్టుకున్న లక్ష్యానికి అనుగుణంగా, కచ్చితంగా ఇంకా కొన్ని రోజులు రోజుకు 6 లక్షల వాక్సిన్లు వేయాలి. హోం క్వారంటైన్‌లో ఉన్న వాళ్లు కచ్చితంగా ఇళ్లలోనే ఉండేలా, రెగ్యులర్‌గా మానిటర్ చేయాలి. అందుకు తగిన ప్రొటోకాల్ రూపొందించుకోండి. తరుచూ సందర్శించడం వంటివి చేయాలి. అదే విధంగా వారికి ఏడు రకాల ట్యాబ్లెట్లు, క్యాప్సుల్స్‌తో కూడిన కోవిడ్ కిట్ తప్పనిసరిగా అందించాలి. ఆస్పత్రుల్లో ఆక్సిజన్ సరఫరా పూర్తి స్థాయిలో ఉండాలి. విశాఖలో ప్రొడక్షన్ సెంటర్ నుంచి పూర్తి స్థాయిలో ఉత్పత్తి జరిగేలా చూసి, దాన్ని అన్ని 108 ఆస్పత్రుల్లో తగినంత ఆక్సిజన్ ఉండేలా చూడండి. అదే విధంగా రెమ్‌డెసివిర్ ఇంజక్షన్లు. రోగులకు అవసరమైన ఇంజక్షన్లు అన్ని చోట్ల అందుబాటులో ఉండే విధంగా చర్యలు తీసుకోవాలి. ఇంజక్షన్ లేకుండా ఏ ఒక్క రోగి కూడా ఇబ్బంది పడకుండా చూడాలి అని సీఎం జగన్ ఆదేశించారు. రాష్ట్రంలో పాజిటివిటీ రేటు ఇప్పుడు 6.03 శాతం ఉందని సమీ సమావేశంలో వైద్య ఆరోగ్య శాఖ అధికారులు తెలిపారు. కోవిడ్ చికిత్స కోసం రాష్ట్రంలో 108 ఆస్పత్రులు వైద్య ఆరోగ్య శాఖ పరిధిలో ఉండగా వాటిలో 15,669 బెడ్లు అందుబాటులో ఉన్నాయని, వాటిలో ఇప్పుడు 4,889 బెడ్లు ఆక్యుపైడ్ కాగా, 1,987 వెంటిలేటర్లు కూడా అందుబాటులో ఉన్నాయని, నిన్నటి (బుధవారం) వరకు మొత్తం 22,637 మంది హోం ఐసొలేషన్‌లో ఉన్నారని వైద్య ఆరోగ్య శాఖ అధికారులు వివరించారు. డిప్యూటీ సీఎం, వైద్య ఆరోగ్య శాఖ మంత్రి ఆళ్ల నాని, డీజీపీ గౌతమ్ సవాంగ్, వైద్య ఆరోగ్య శాఖ ముఖ్య కార్యదర్శి అనిల్‌కుమార్ సింఘాల్, కుటుంబ సంక్షేమ కమిషనర్ కాటమనేని భాస్కర్, రవాణా శాఖ ముఖ్య కార్యదర్శి ఎంటీ కృష్ణబాబు, మున్సిపల్ శాఖ స్పెషల్ సీఎస్ వై.శ్రీలక్ష్మి, ఆరోగ్య శాఖ ముఖ్య కార్యదర్శి ఎం.రవిచంద్ర, ఉన్నత విద్యా శాఖ స్పెషల్ సీఎస్ సతీష్‌చంద్ర, రెవెన్యూ శాఖ ముఖ్య కార్యదర్శి వి.ఉషారాణి, పాఠశాల విద్య శాఖ ముఖ్య కార్యదర్శి బుడితి రాజశేఖర్, ఆరోగ్యశ్రీ సీఈఓ డాక్టర్ ఎ.మల్లికార్జున్‌తో పాటు, వైద్య ఆరోగ్య శాఖకు చెందిన పలువురు ఉన్నతాధికారులు ఈ సమీక్షకు హాజరయ్యారు.

# కరోనా సెకండ్ వేవ్ ఎఫెక్ట్.. మరో ఉద్దీపన ప్యాకేజీ ప్రకటించనున్న కేంద్రం!

న్యూఢిల్లీ: కరోనా సెకండ్ వేవ్ ఉధృతంగా ఉన్న సమయంలో వివిధ రాష్ట్రాలు లాక్‌డౌన్‌లు, నైట్ కర్ఫ్యూలు విధిస్తున్నాయి. వీటి కారణంగా మరోసారి ఆర్థిక సంక్షోభం ఏర్పడకూడదన్న ఉద్దేశంతో కేంద్రం మరో ఉద్దీపన ప్యాకేజీ ప్రకటించే అవకాశం కనిపిస్తోంది. కరోనా సెకండ్ వేవ్ కారణంగా తమ జీవనోపాధి కోల్పోయే నిరుపేదల కోసం ఈ ఉద్దీపన ప్యాకేజీ ప్రకటించే అవకాశం ఉన్నట్లు హిందుస్థాన్ టైమ్స్ తన రిపోర్ట్‌లో వెల్లడించింది. గతేడాది కరోనా సమయంలో ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ రూ.20 లక్షల కోట్ల ప్యాకేజీ ప్రకటించిన విషయం తెలిసిందే. కరోనా మొదటి వేవ్ తగ్గి ఆర్థిక వ్యవస్థ మళ్లీ కోలుకుంటున్న సమయంలో సెకండ్ వేవ్ ఉధృతంగా దాడి చేస్తోంది. ఈసారి దాని తీవ్రత మరింత ఎక్కువగా ఉంది. గడిచిన 24 గంటల్లో ఏకంగా 2 లక్షలకుపైగా కేసులు నమోదయ్యాయి. దీని కారణంగా లాక్‌డౌన్లు, 144 సెక్షన్లు, నైట్ కర్ఫ్యూలు విధిస్తున్నారు. ఇవి మరోసారి పరోక్షంగా బ్యాంకులపై ప్రభావం చూపిస్తున్నాయి. ఇచ్చిన రుణాలు తిరిగి వచ్చే పరిస్థితి కనిపించడం లేదు. ఈ ఏడాదికి ఆర్బీఐ ఇంకా మారటోరియం కూడా ఇంకా ప్రకటించలేదు. బ్యాంకు రుణాల్లో 45 శాతం వాటా ఉన్న ఆరు రాష్ట్రాల్లోనే 80 శాతం కరోనా కేసులు ఉన్నట్లు రేటింగ్ ఏజెన్సీ ఫిచ్ ఈ మధ్యే వెల్లడించింది.

# ఒకే కుటుంబానికి చెందిన ఆరుగురి దారుణ హత్య

### పాత కక్షల నేపథ్యంలో దారుణం

### మృతుల్లో ఇద్దరు చిన్నారులు

విశాఖపట్నం విశాఖపట్నం జిల్లాలో దారుణం జరిగింది. పాత కక్షల నేపథ్యంలో ఓ అగంతకుడు ఒకరు.. ఇద్దరు కాదు.. ఏకంగా ఆరుగురిని అత్యంత దారుణంగా హతమార్చాడు. చిన్న పిల్లలను సైతం విడిచిపెట్టకుండా అత్యంత పాశవికంగా పొట్టనబెట్టుకున్నాడు. విశాఖపట్నంలోని పెందుర్తి మండలం జుత్తాడలో జరిగిన ఈ దారుణ సంఘటన రాష్ట్రవ్యాప్తంగా కలకలం సృష్టించింది. వివరాలు.. పాత కక్షల నేపథ్యంలో ఓ అగంతకుడు.. ఇంట్లో నిద్రిస్తున్న రమణ కుటుంబంపై దాడి చేసి చంపాడు. పదునైన ఆయుధంతో ఇంట్లో ఉన్న కుటుంబసభ్యులందరినీ దారుణంగా హతమార్చాడు. మృతదేహాలన్నీ రక్తపు మడుగులో పడి ఉండటాన్ని చూసిన స్థానికులు పోలీసులకు సమాచారమిచ్చారు. రెండు మృతదేహాలు బాత్ రూములో పడివున్నాయి. మృతులు రమణ (63), ఉషారాణి (35), రమాదేవి (53), అరుణ(37) చిన్నారులు ఉదయ్ (2), ఉర్విష ( 6 నెలలు) గా గుర్తించారు. రెండు కుటుంబాల మధ్య ఉన్న పాత కక్షలే ఈ సంఘటనకు కారణమని పోలీసులు అనుమానిస్తున్నారు. ఆరుగురిని అప్పలరాజు అనే వ్యక్తే చంపి ఉంటాడని ప్రాథమిక నిర్ధారణకు వచ్చారు. అనంతరం అప్పలరాజును పోలీసులు అరెస్టు చేశారు. వివరాలను సేకరిస్తున్నారు. ఆరుగురి హత్యతో జుత్తాడలో విషాదకర పరిస్థితులు నెలకొన్నాయి. విశాఖపట్నం సీపీ మనీష్ కుమార్ కూడా సంఘటనా స్థలానికి చేరుకొని వివరాలను తెలుసుకున్నారు.



# 'ఉద్యోగ దీక్ష చేపట్టిన వైఎస్ షర్మిల



హైదరాబాద్ ఏప్రిల్ 15 తెలంగాణలో కేసీఆర్ అధికారంలోకి వచ్చి ఏడేళ్లు గడుస్తున్నా ఇంతవరకు రాష్ట్రం కోసం పోరాడిన నిరుద్యోగులకు ఉద్యోగాలు ఇవ్వలేదని నిరసిస్తూ వైఎస్ షర్మిల దీక్ష చేపట్టారు. రాష్ట్రంలో యువతకు ఉద్యోగాలు కల్పించాలని డిమాండ్ చేశారు. హైదరాబాద్ లోని ఇందిరాపార్క్ దగ్గర షర్మిల దీక్షకు దిగారు. షర్మిల దీక్ష సాయంత్రం 5 గంటల వరకు కొనసాగనుంది. షర్మిల దీక్ష శిబిరంలో ప్రత్యేక లుక్ తో ఆకట్టుకున్నారు. సాదాసీదా కాటన్ పోచంపల్లి చీరలో దర్శనమిచ్చారు. షర్మిల లుక్ శిబిరంలో ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. ఎప్పుడూ చీక కట్టని షర్మిల కట్టు బొట్టు ప్రత్యేకంగా నిలిచాయి. నిమ్మపండు చీర నీలం అంచుతో షర్మిల హుందాగా కనిపించారు. ఈ సందర్భంగా దీక్ష స్థలంలో వైఎస్ షర్మిల మాట్లాడారు. 'ఉద్యోగాలు రాక నిరుద్యోగులు చనిపోతుంటే కేసీఆర్ కు కనిపించడం లేదా? ' అని ప్రశ్నించారు. మీరు గడిలో నిద్రపోతున్నారా? మీ చాతిలో ఉంది గుండెనా? లేక బండరాయినా? అంటూ షర్మిల నిప్పులు చెరిగారు. దాదాపు 40 లక్షల మంది తెలంగాణలో ఉద్యోగాల కోసం ఎదురుచూస్తున్నారని.. ఆత్మహత్యలకు పాల్పడుతున్నారని.. ఇంత జరుగుతున్న దున్నపోతు మీద వాన పడినట్లు కేసీఆర్ పరిస్థితి ఉందని షర్మిల విమర్శించారు. నిరుద్యోగుల తరుపున తాము నిలబడుతాం అని.. వారికి న్యాయం జరగాలని షర్మిల హామీ ఇచ్చారు. నోటిఫికేషన్లు ఇస్తే నిరుద్యోగులు బతికే వారని.. వారి కుటుంబాలకు కేసీఆర్ క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. ఈ దీక్షకు బిసి సంక్షేమ సంఘం జాతీయ అద్యక్షులు ఆర్.కృష్ణయ్య పాల్గొని మద్దతు ప్రకటించారు.

# భారత్, పాక్ మధ్య రహస్య చర్చలు..!



న్యూఢిల్లీ: భారత్, పాక్‌ల మధ్య నెలకొన్న ప్రతిష్టంభనను తొలగించేందుకు ఇరు దేశాల ఇంటెలిజెన్స్ అధికారులు ఈ ఏడాది జనవరిలో రహస్యంగా సమావేశమైనట్టు తెలుస్తోంది. ఈ చర్చలతో సంబంధం ఉన్న వర్గాలు ఈ విషయాలను వెల్లడించాయి. 2019లో పుల్వామాలో భారత దళాలపై జరిగిన 'ఉగ్రవదాడి తరువాత భారత్-పాక్ దౌత్య సంబంధాలు దెబ్బ తిన్న విషయం తెలిసిందే. ఈ దాడి వెనుకు పాక్ ప్రేరేపిత ఉగ్రవాదులు ఉన్నారన్న విషయం బయటపడటంతో మోదీ ప్రభుత్వం యుద్ధవిమానాలను రంగంలోకి దింపి..ఉగ్ర శిక్షణ శిబిరాలను ధ్వంసం చేసింది. ఆదే ఏడాది..భారత ప్రభుత్వం కశ్మీర్‌కు స్వయంప్రతిపత్తిని ఇచ్చే ఆర్టికల్ 370నీ రద్దు చేసింది. ఈ పరిణామాలతో పాకిస్థాన్ అగ్గిమీద గుగ్గిలమైంది. భారత్‌తో దౌత్య సంబంధాలను తెంచుకున్నట్టు అధికారికంగా ప్రకటించింది. అంతేకాకుండా.. ద్వైపాక్షిక వాణిజ్యాన్ని కూడా నిలిపివేసింది. అయితే ఈ స్థితిని చక్కదిద్దేందుకు ఇరు దేశాలూ తెరవెనుక చర్చలు చేపడుతున్నాయని విశ్వసనీయ వర్గాలు చెబుతున్నాయి. పాక్ గూఢచార సంస్థ ఐఎస్ఐకి చెందిన అధికారులు, భారత నిఘా సంస్థ 'రావ అధికారులు ఇటీవల దుబాయ్‌లో సమావేశమై ఈ అంశాలను చర్చించారట. ఈ సమావేశం ఏర్పాటు వెనుకు యూఏఈ ప్రభుత్వం కృషి కూడా ఉందని తెలసింది. ఈ మేరకు ప్రముఖ అంతర్జాతీయ వార్త సంస్థ ఓ కథనాన్ని ప్రచురించింది. అయితే..భారత ప్రభుత్వం ఈ వార్తలపై ఇప్పటివరకూ అధికారికంగా స్పందించలేదు. కాగా.. భారత్, పాక్ ఉన్నతాధికారులు గత కొద్ది నెలలుగా వివిధ దేశాల్లో రహస్యంగా సమావేశమవుతూ చర్చలు జరుపుతున్నారని పాక్ రక్షణ రంగ విశ్లేషకురాలు అయోషా సిద్దీకా తెలిపారు. 'ఇరు దేశాల ఉన్నతాధికారులు.. థాయ్‌ల్యాండ్, లండన్, దుబాయ్‌లలో సమావేశమయ్యారని నేను అనుకుంటున్నావ అని ఆమె వ్యాఖ్యానించారు. 'ఈ చర్చలు విఫలమయ్యే అవకాశం ఇప్పటికీ ఉంది. అందుకే..దీనిపై బహిరంగంగా ఎవరూ స్పందించట్లేదు. ఇవేమీ శాంతిచర్చలు కావు. ఆ మాటకొస్తే..ఈ సమావేశాలకు అసలు పేరే లేదు.వ అని ఈ వ్యవహారంతో సంబంధం ఉన్న మరో వ్యక్తి వ్యాఖ్యానించారు. ఈ రహస్య చర్చలు ప్రారంభించడానికి భారత్,పాక్‌లకు ముఖ్యమైన కారణాలే ఉన్నాయని రక్షణ రంగం విశ్లేషకులు చెబుతున్నారు. చైనాతో భారత్‌కు ఉన్న వివాదం ఇప్పటికీ పూర్తిగా సద్దుమణగలేదు. ఈ పరిస్థితుల్లో పాక్‌తో నెలకొన్న వివాదం సుదీర్ఘకాలం పాటు కొనసాగడం భారత్‌కు ఇష్టంలేదు.

# ముందు జాగ్రత్తలు తీసుకోవాలి

### మంత్రి ఆళ్ల నాని



అమరావతి కరోనా కేసులు ఎక్కువగా ఉన్న కృష్ణ జిల్లా, గుంటూరు, విశాఖపట్నం, నెల్లూరు, తూర్పుగోదావరి, చిత్తూరు జిల్లాలపై కరోనా నివారణకు రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి, వైద్య ఆరోగ్య శాఖ మంత్రి ఆళ్ల నాని అధికారులతో సమీక్ష నిర్వహించారు. అన్ని జిల్లాల వైద్య ఆరోగ్య శాఖ అధికారులతో మొబైల్ కాన్ఫరెన్స్ లో మాట్లాడి అన్ని జాగ్రత్తలు తీసుకోవాలని అదేశాలు ఇచ్చారు. పశ్చిమగోదావరి జిల్లాలో కరోనా నివారణకు జిల్లా యంత్రాంగాన్ని పూర్తిగా అప్రమత్తం చేసారు. రానున్న ఆరు వారాల్లో కరోనా కేసులు భారీగా పెరిగే అవకాశం... ప్రజలు మరింతగా జాగ్రత్తలు పాటించండి. కరోనా నివారణకు రాష్ట్ర ముఖ్యమంత్రి వైస్ జగన్మోహన్ రెడ్డి ప్రత్యేకంగా చర్యలు చేపట్టారు. జిల్లా వ్యాప్తంగా కరోనా కేసులు ఒక్కసారే పెరగడంతో వైద్య ఆరోగ్య శాఖ అధికారులను అలర్ట్ చేసారు. అత్యవసరం అనుకుంటేనే బైటికి రావాలి. కోవిడ్ నియంత్రణకు కట్టుదిట్టమైన చర్యలు తీసుకుంటున్నమని మంత్రి అన్నారు. ప్రజలు తప్పనిసరిగా మాస్కు లు ధరించాలి. గతంతో పోలిస్తే వైరస్ వేగంగా విస్తరిస్తుంది.

# సంపాదకీయం

శుక్రవారం 16 ఏప్రిల్ 2021

## బెంగాల్ ఎన్నికలు...సరిహద్దులు దాటేస్తున్న పార్టీలు

పశ్చిమబెంగాల్ ఎన్నికలో అన్ని పార్టీలు సరిహద్దులు దాటేస్తున్నాయి. కేంద్ర బలగాలను, ఎన్నికల కమిషన్ ను సైతం తమ రాజకీయాల్లో పావులుగా వాడేస్తున్నాయి. సామదానభేదోపాయాల ప్రయోగం, దండ నీతి, ఆర్థిక వనరుల వినియోగం అన్నిచోట్లా కామన్. కుల,మతాలను వాడుకోవడమూ రాజకీయపార్టీలకు కొత్త కాదు. కానీ భవిష్యత్ భారత రాజకీయాలకు దిక్సూచిగా నిలుస్తుందని భావిస్తున్న నేపథ్యంలో పశ్చిమబంగలో బీజేపీ, తృణమూల్ ల యుద్ధం కొత్త విన్యాసాలకు దారితీస్తోంది. గతంలో ఎన్నడూ లేని విధంగా ముఖ్యమంత్రి మమతా బెనర్జీ భావోద్వేగ రాజకీయాలను పతాక స్థాయికి తీసుకెళుతున్నారు.. మైనారిటీ ఓటు చేజారకుండా చూసుకోవడానికి ఆమె చేయని ప్రయత్నమంటూ లేదు. హిందూ ఓట్లను సంఘటితం చేయడానికి బీజేపీ కిందుమీదులవుతోంది. జై శ్రీరామ్ ఇప్పుడక్కడ కామన్ పలకరింపు అయిపోయింది. ప్రధాన పోటీలో లేకుండా పోయిన ఒకనాటి పాలకపార్టీలు కాంగ్రెసు, వామపక్షాలు, మత వాద పార్టీలతో జట్టుకట్టి దయనీయమైన పరిస్థితిని చవిచూస్తున్నాయి. అయితే విజేతను నిర్ణయించేది ఈ కూటమేనంటూ వార్తలు వస్తున్నాయి. హిందూ, ముస్లిం ఓట్లలో ఎంతమేరకు ఈ మూడో కూటమి తెచ్చుకోగలుగుతుందనేది చాలా కీలకం. దానిపైనే తృణమూల్, బీజేపీల గెలుపు ఆదారపడి ఉంటుందంటున్నారు. ట్రయాంగిల్ ఫైట్ లో అటు బీజేపీ ఓట్లకు, ఇటు తృణమూల్ ఓట్లకు గాలం వేసి పరువునిలబెట్టుకొనే పనిలో పడింది ఈ కూటమి.త్రిముఖ పోటీ లో సాధారణంగా 40శాతం దరిదాపుల్లోకి వచ్చే పార్టీ సులభంగా అధికారాన్ని చేజిక్కించుకోగలుగుతుంది. కానీ పశ్చిమబంగ లెక్కలు వేరుగా కనిపిస్తున్నాయి. నాలుగో దశ నాటికే చూస్తుంటే ఇక్కడి ఎన్నికలు ముఖాముఖిగా మారిపోయాయి. వామపక్ష, కాంగ్రెసు కూటమి దాదాపు పోటీలో లేనట్లుగా ప్రజలు భావిస్తున్నారు. తృణమూల్, బీజేపీల మధ్య పోటీ నువ్వా, నేనా? తీరులో ఫేస్ టు ఫేస్ గా రూపు దాల్చింది. . దీంతో అదికారం చేపట్టాలనుకుంటున్న పార్టీ కనీసం 45 శాతం పైచిలుకు ఓట్లు తెచ్చుకోక తప్పని అనివార్యత ఏర్పడింది. తాము దాదాపు అధికారంలోకి వచ్చేశామని బీజేపీ క్లెయిం చేస్తోంది. 2016లో నామమాత్రపు సీట్లకు పరిమితమైన కమలం పార్టీ తర్వాత తన స్థానాన్ని బలపరచుకుంది. సొంత బలం కంటే వామపక్ష, కాంగ్రెసు బలహీనతలు ఇందుకు దోహదం చేశాయి. అధికార తృణమూల్ కాంగ్రెసుకు ప్రత్యామ్నాయాన్ని ఆవిష్కరించడంలో ఈ రెండు పార్టీలు విఫలమయ్యాయి. దాంతో బీజేపీ ప్రతిపక్ష ప్రత్యామ్నాయంగా ప్రజలకు కనిపించింది. 2019 లోక్ సభ ఎన్నికల్లో అధికారపార్టీకి దీటుగా బీజేపీకి సీట్లు కట్టబెట్టారు ప్రజలు. 40 శాతం ఓట్లిచ్చారు. కానీ తాజా అసెంబ్లీ ఎన్నికల్లో అదే స్థాయి పర్ ఫామెన్స్ చూపిస్తే సరిపోదనేది సెఫాలజిస్టుల అంచనా. వామపక్ష, కాంగ్రెసు పార్టీలు మరింతగా బలహీనపడటంతో 90 శాతం మేరకు ఓట్లు బీజేపీ, తృణమూల్ మధ్య కేంద్రీక్రుతం అయినట్లు అంచనాలు వెలువడుతున్నాయి. అంటే అధికారం దక్కించుకోవాల్సిన పార్టీ కనీసం 45శాతం తెచ్చుకోవాల్సిందే. ఈ ఈక్వేషన్ బీజేపీకి ఇబ్బందికరంగానే కనిపిస్తోంది. కాంగ్రెసు, కమ్యూనిస్టులు బలంగా ఓట్లు చీల్చగలిగితేనే బీజేపీకి లాభం చేకూరుతుంది.పశ్చిమబెంగాల్ లో ఎన్నికలకు ముందు నాలుగు విడతలుగా వ్యూహకర్త ప్రశాంతకిశోర్ బృందం సర్వేలు చేసింది. తృణమూల్ కాంగ్రెసుకు 45 నుంచి 47 శాతం వరకూ ఓటింగు వస్తుందని అంచనా వేసింది. బీజేపీ ఓటింగ్ 2019 కి మించకుండా 40శాతం లోపుగానే ఉంటుందనేది ఐ పాక్ గణాంకాల సారాంశం. దీనిపై రకరకాల మదింపు తర్వాత ప్రశాంత కిశోర్ బీజేపీకి సవాల్ విసిరారు. బెంగాల్ లో బీజేపీ అధికారంలోకి వస్తే తాను రాజకీయ వ్యూహ కర్త గా పనిచేయడం మానేస్తానని బహిరంగంగా ప్రకటించారు. బీజేపీ 100లోపు సీట్లకే పరిమితమవుతుందని వెల్లడించారు. తన టీమ్ అధ్యయనంపై విశ్వాసం ఒకవైపు, బీజేపీ నైతిక స్థైర్యాన్ని దెబ్బతీయడం మరో లక్ష్యంగా ఆయన ఈ ప్రకటన చేశారు. అయితే ఇప్పటికే ముగిసిన సగం ఎన్నికలను పరిశీలిస్తే బీజేపీ అధికార పార్టీకి గట్టిగానే సవాల్ విసిరినట్లు తెలుస్తోంది. పీకే టీమ్ సైతం ఎగ్జిట్ పోల్ సర్వేలో తాము ఊహించిన దానికంటే బీజేపీ బలంగా ఉందని లెక్కలు వేసినట్లు చెబుతున్నారు. దాంతో మిగిలిన దశల పోలింగ్ పై ప్రభావంపడేలా మమత ఎదురుదాడిని ఉధృతం చేశారు. బయటి వ్యక్తులు బెంగాల్ ను శాసించాలని చూస్తున్నారనే ప్రచారం పెంచారు. మమత పై జరిగినట్టుగా చెబుతున్న దాడి నుంచి సానుభూతిని రాబట్టాలని వ్యూహాన్ని సవరించుకున్నారు. మొత్తమ్మీద బెంగాల్ ఎన్నిక మమతా బెనర్జీ కి ఎంత ప్రతిష్ఠాత్మకమో ప్రశాంతకిశోర్ కు కూడా అదే తరహాలో కనిపిస్తోంది. ఒకవేళ పశ్చిమ బెంగాల్ లో తన అంచనాలు తప్పితే వ్యూహకర్త పదవి నుంచి తప్పుకోవాలని ఆయన నిర్ణయించుకున్నట్టుగా చెబుతున్నారు. పూర్తి స్థాయి రాజకీయవేత్తగా సొంత రాష్ట్రమైన బిహార్ పై దృష్టి పెట్టాలనుకుంటున్నారు.ఉనికిని చాటుకోవడానికి, అస్తిత్వాన్ని కాపాడుకోవడానికి కమ్యూనిస్టులు, కాంగ్రెసు నేతలు పడరాని పాట్లు పడుతున్నారు. సిద్దాంతాలను పక్కనపెట్టి మతవాద పార్టీలతోనూ చేతులు కలిపారు. కూటమి కట్టారు. వ్రతం చెడ్డా ఫలితం దక్కుతుందన్న గ్యారంటీ లభించడం లేదు. ఈ పార్టీలు వెస్టుబెంగాల్ లో మరింత బలహీన పడతాయనేది అంచనా. జాతీయ స్థాయి ప్రాధాన్యాన్ని వామపక్షాలు కోల్పోతాయి. కాంగ్రెసు పార్టీ పెద్ద రాష్ట్రాల్లో తన స్తానం ప్రశ్నార్థకం చేసుకుంటోంది. ఒకవేళ మమతకు భంగపాటు ఎదురైతే బీజేపీ కి 2024 సార్వత్రిక ఎన్నికలకు నైతిక బలం చేకూరుతుంది. దేశవ్యాప్తంగా తీవ్ర ప్రతికూల పరిస్థితుల్లోనూ విజయం సాధించగలిగితే పార్టీకి తిరుగులేదన్న వాస్తవం దేశమంతా చాటి చెప్పినట్లవుతుంది. బీజేపీ పరాజయం పాలైతే ఆత్మావలోకనం తో పాటు ఆత్మరక్షణలో పడిపోతుంది. విపక్షాలు జట్టు కడితే తీవ్రమైన ఒత్తిడి తప్పకపోవచ్చు. స్వాతంత్ర్య సమర కాలం నుంచి రాజకీయ మార్పులకు తొలి వేదికగా ఉంటూ వచ్చింది పశ్చిమబెంగాల్. ఇప్పుడే తీర్పు చెప్పనుందో వేచి చూడాలి

# దువ్వాడ ఆజన్మ వైరం

శ్రీకాకుళం, ఏప్రిల్ 15, (న్యూస్ పల్స్)శ్రీకాకుళం జిల్లాలో కొందరి నేతల రాజకీయాలు ఇలాగే ఉంటాయి. అక్కడ కొందరు మాస్కులు వేసుకుని అధికారంలో ఉన్న పార్టీతో దోస్తీ చేస్తుంటారు. అవతల వారు మళ్ళీ అధికారంలోకి వస్తే వీరికి సాయం చేస్తూ ఆ బాకీ తీర్చేస్తారు. ఇలా సాగిపోతున్న రాజకీయాల్లో దూకుడు, ముక్కుసూటితనమే తప్ప మరేమీ తెలియని దువ్వాడ శ్రీనివాస్ ప్రవేశించారు. ఆయన మొదట కాంగ్రెస్ లో ఉండేవారు. మైనింగ్ వ్యాపారంలో బాగానే ఆర్జిస్తూ బంగారంలా ఉండే దువ్వాడ కాంగ్రెస్ లో చేరాక కానీ అసలు సంగతి తెలియలేదు.అటు సొంత కాంగ్రెస్ పార్టీ, ఇటు విపక్ష తెలుగుదేశం నాయకులు అందరూ కలసి టార్గెట్ చేసి దువ్వాడ శ్రీనివాస్ ను ఇబ్బందుల పాలు చేశారు. జిల్లా పరిషత్ చైర్మన్ అవుతాడనుకున్న దువ్వాడ కేవలం వైఎస్ చైర్మన్ తోనే సరిపెట్టుకోవాల్సివచ్చింది. మరో వైపు చూస్తే 2009 ఎన్నికల నాటికి ప్రజరాజ్యం నుంచి ఎమ్మెల్యేగా పోటీ చేసినా, 2014, 2019ల్లో వైసీపీ నుంచి బరిలో దిగినా గెలుపు మాత్రం ఆయన పిలుపు వినలేదు. మొత్తానికి ఇన్నాళ్ళకు ఆయన ఎమ్మెల్సీ అయ్యారు. ఇది తనకు జగన్ ఇచ్చిన వరం అంటున్నారు.తాను జగన్ని నమ్మానని, జగన్ కూడా మాట మీద నిలబడి తనకు ఎమ్మెల్సీ పదవి ఇచ్చి చట్ట సభల్లో అడుగుపెట్టేలా చేశారని దువ్వాడ శ్రీనివాస్ అంటున్నారు. తాను ఇంతకంటే మరేమీ కోరుకోనని కూడా ఆయన చెబుతున్నారు. ఇపుడు తన మీద ఎంతో బాధ్యత ఉందని కూడా అంటున్నారు టెక్కలిలో అచ్చెన్నాయుడుని ఓడించడమే తన టార్గెట్ అని కూడా ఎలాంటి జంకూ గొంకూ లేకుండా దువ్వాడ శ్రీనివాస్ చెప్పేశారు. తాను టెక్కలి నుంచి ఎమ్మెల్యేగా గెలిచి ఆ మీదటనే 2024లో వచ్చే ప్రభుత్వంలో మంత్రిని అవుతాను అని ఆయన ధీమాగానే చెబుతున్నారు. టెక్కలితో పాటు శ్రీకాకుళం జిల్లాలోని పది అసెంబ్లీ సీట్లను కూడా గెలిపించి జగన్ కి గిఫ్ట్ ఇస్తామని కూడా అయన అంటున్నారు.దువ్వాడ శ్రీనివాస్ విషయం తీసుకుంటే ఆయన తనను రాజకీయంగా అణగదొక్కి తన వ్యాపారాలను విధ్వంసం చేసిన వారి మీద కసితో ఉన్నారని అర్ధమవుతోంది. అలాగే తనను జైలు పాలు చేసిన వారి మీద కూడా ఆయన కత్తి కట్టారు రాజకీయంగానే ఇవన్నీ ఎదుర్కొంటానని అంటున్నారు. అంతే కాదు శ్రీకాకుళం జిల్లాలో అచ్చెన్నాయుడిని ఓడించి రాజకీయంగా ఆయన హవాకు ఫుల్ స్టాప్ పెడతామని కూడా చెబుతున్నారు. జగన్ కోరింది కూడా ఇదే. తనలాగే దేనికైనా తట్టుకునే దువ్వాడ శ్రీనివాస్ ను అందుకే ఆయన రెడీ చేసి మరీ అచ్చెన్నకు పోటీగా దింపారు. ఇపుడు దువ్వాడ శ్రీనివాస్ ఆ బాధ్యతను నూటిని నూరు శాతం నెరవేరుస్తాను అంటున్నారు. సో వైసీపీకి జగన్ కి ఇంకేం కావాలి

# స్థానికులే వైసీపీకి ఓటు...



విజయవాడ, ఏప్రిల్ 15, (న్యూస్ పల్స్)ఇటీవల ముగిసిన స్థానిక ఎన్నికలను పరిశీలిస్తే.. రాష్ట్రంలో చాలా ప్రాంతాల్లో చిత్రమైన సంగతులు వెలుగు చూశాయి. విశాఖ, విజయవాడ వంటి కీలక నగరాల్లో కొన్ని చోట్ల టీడీపీ పుంజుకోవడం.. మరికొన్ని చోట్ల అందునా.. పట్టు బాగుందని భావించిన చోట్ల మాత్రం.. పార్టీ ఓడిపోవడం.. వంటివి చోటు చేసుకున్నాయి. ఈ నేపథ్యంలో వీటిపై నిశితంగా దృష్టి పెడితే కొన్ని సంచలన విషయాలు వెలుగు చూడడం గమనార్హం. విజయవాడనే తీసుకుంటే.. ఇక్కడ కార్పొరేషన్ పీఠాన్ని వైసీపీ కైవసం చేసుకుంది. అయితే.. ఇక్కడి మూడు నియోజకవర్గాల్లో ఓట్ల షేరింగ్‌ను గమనిస్తే.. ఆసక్తిగా ఉంది. తూర్పు నియోజకవర్గంలో టీడీపీ గత ఎన్నికల్లో విజయం దక్కించుకుంది.ఈ నియోజకవర్గంలో చంద్రబాబుకు అభిమాన గణంతోపాటు.. కమ్మ సామాజిక వర్గం హవా ఎక్కువగా ఉంది. పైగా ఇక్కడ నుంచి గెలిచిన ఎమ్మెల్యే గద్దె రామ్మోహన్ కూడా కమ్మ వర్గానికి చెందిన నాయకుడే కావడం గమనార్హం. గత అసెంబ్లీ ఎన్నికల్లో ఇక్కడ నుంచి గద్దె రామ్మోహన్ 18 వేల ఓట్ల మెజార్టీతో ఘనవిజయం సాధించారు. ఇక్కడ ఓటు షేర్‌ను గమనిస్తే.. తూర్పులోని ఏడు డివిజన్లలో టీడీపీ గెలుపు గుర్రం ఎక్కింది. పైగా ఓటు బ్యాంకు కూడా ఎక్కువగా పడింది. దీనికి రీజనేంటి ? అంటే.. స్వతహాగా.. ఇక్కడే ఉన్న అంటే.. ఇక్కడే పుట్టి పెరిగిన కమ్మ సామాజిక వర్గం వైసీపీ వైపు మొగ్గు చూపగా.. ఇతర ప్రాంతాల నుంచి వచ్చి.. వ్యాపారాలు ఏర్పాటు చేసుకుంటోన్న, రియల్ రంగంలో ఉన్న కమ్మలు మాత్రం టీడీపీకి అనుకూలంగా ఓటేశారనే విషయం వెల్లడైంది.కోస్తాలోని వివిధ ప్రాంతాల నుంచి వచ్చి ఇక్కడ స్థిరపడిన 'కమ్మ' వర్గ ఓటర్లుగా భావిస్తున్నారు. వైసీపీపై వ్యతిరేకత వీరిలో కొట్టొచ్చినట్టు కనిపించిందనే వ్యాఖ్యలు వస్తున్నాయి. జగన్ తీసుకున్న మూడు రాజధానుల నిర్ణయంతో వీరి వ్యాపారాలు భారీగా దెబ్బతిన్నాయి. రియల్ రంగం కుదేలైంది. దీంతో వీరు అధికార పార్టీకి వ్యతిరేకంగా మారినట్టు తెలుస్తోంది. ఈ క్రమంలోనే ఈ 'కమ్మ' సామాజికవర్గం ఈ ఎన్నికల్లో టీడీపీని గెలిపించాలనే పట్టుదలతో వ్యవహరించిందని, వారు ఎక్కడా అధికార పార్టీకి లొంగకుండా పార్టీ గెలుపు కోసం సైలెంట్‌గా పనిచేశారని అంటున్నారు. ఇక, ఇక్కడే పుట్టి పెరిగిన కమ్మ వర్గం మాత్రం.. వైసీపీ వైపు మొగ్గు చూపారని తేలింది. దీంతో పలు డివిజన్లలో టీడీపీ గెలుపు గుర్రం ఎక్కిందని అంటున్నారు. సెటిల్ కమ్మ ఓటర్ల ప్రభావం ఎక్కువగా ఉన్న పడమట, తూర్పు నియోజకవర్గంలో ఆ పార్టీ పలు డివిజన్లు గెలిచింది. ఇక టీడీపీ నుంచి గెలిచిన కార్పొరేటర్లలో కూడా ఎక్కువ మంది కమ్మ వర్గం వారే ఉన్నారు.

# మోడీ టార్గెట్ గా టీడీపీ...

తిరుపతి, ఏప్రిల్ 14, (న్యూస్ పల్స్)ఽతిరుపతి ఎన్నికల్లో చావో రేవో తేల్చుకోవాలని నిర్ణయించుకున్న టీడీపీ.. ఆదిశగా అనేక వ్యూహాలు అమలు చేస్తోంది. ఈ క్రమంలోనే సెంటిమెంటును రెచ్చగొట్టే కార్యక్రమానికి టీడీపీ నాయకులు తెరదీసినట్టు తెలుస్తోంది. దీనిలో భాగంగా.. ప్రత్యేక హోదా ఇవ్వని మోడీని టార్గెట్ చేసుకుని.. ఓట్లు చీలిపోయి.. బీజేపీ బలపడకుండా చూస్తోందనే టాక్ వినిపిస్తోంది. అయితే.. ఈ క్రమంలో టీడీపీ చేస్తున్న విమర్శల్లో 'పస' ఎంత? అనేది చర్చనీయాంశంగా మారింది. గత 2019 ఎన్నికలకు ముందు కూడా ఇలానే మోడీపై విమర్శలు సంధించారు.. టీడీపీ సీనియర్లు. అప్పటి ప్రభుత్వ సలహాదారు.. కుటుంబ రావు ఎన్నికలకు ముందు మీడియా సమావేశం పెట్టి మరీ ఓ బాంబు పేల్చారు.కేంద్రంలోని నరేంద్ర మోడీ పెద్ద కుంభకోణం చేశారని ఆరోపించారు. ఇది తీవ్ర చర్చనీయాంశంగా మారింది. పత్రికల్లో ప్రముఖంగా ప్రచారంలోకి వచ్చింది. అయితే.. ఇంతా చేస్తే.. అది రఫేల్ యుద్ధ విమానాల కుంభకోణానికి సంబంధించిన అంశం. దీనిపై అప్పట్లోనే సుప్రీం కోర్టులో పిటిషన్లు పడ్డాయి. అనిల్ అంబానీ సంస్థకు మేలు చేసేలా ఫ్రాన్స్ నుంచి కొనుగోలు చేసిన ఈ యుద్ధ విమానాల కాంట్రాక్టును అప్పగించారని తెలిపారు. అయితే.. సుప్రీం కోర్టు వీటిని గుండుగుత్తగా కొట్టేయడం.. మోడీ పాత్ర లేదని పేర్కొనడం కొసమెరుపు. అంటే.. అప్పట్లో మోడీపై చేసిన దాడిని రాజకీయ కోణంలోనే చూడాల్సి వచ్చింది. మోడీని బద్నాం చేయడం ద్వారా.. ఒక్కసారిగా ఎన్నికల వేళ ఒక హైప్ సృష్టించాలని టీడీపీ ప్రయత్నించింది.ఇక, ఇప్పుడు కూడా ఇదే తరహాలో టీడీపీ నాయకులు మోడీని టార్గెట్ చేసుకున్నారు. ఈ క్రమంలో వారు ఎంచుకున్న సబ్జెక్టు.. ప్రధాన మంత్రి ఆవాస్ యోజన పథకం. ఈ పథకం కింద పేదలకు రూ.2.6 లక్షల రూపాయలతో దీనిలో (రాష్ట్ర సర్కారు వాటా కూడా ఉంటుంది) భారీ ఎత్తున కుంభకోణం జరిగిందని.. దీనిపై సీబీఐ విచారణకు ఆదేశించాలని టీడీపీ డిమాండ్ చేస్తోంది. అంటే.. గృహ నిర్మాణం కింద పేదలకు ఇస్తున్న రెండున్నర లక్షల రూపాయల్లో కుంభకోణం పేరుతో మోడీ ప్రజాధనాన్ని దోచేశారన్నది టీడీపీ విమర్శ. అయితే.. ఇక్కడ చిత్రంగా అదే ప్రధాని చేతుల్లో ఉండే సీబీఐతో విచారణ కోరుకోవడం గమనార్హం. సీబీఐ అంటేనే ప్రధాని చెప్పినట్టునడుస్తుందనే వ్యాఖ్య ఉంది.
మరి ఇప్పుడు ప్రధాని కుంభకోణం చేశారని ఆరోపిస్తున్న టీడీపీ సీబీఐ విచారణకు కోరుకోవడం విచిత్రంగా ఉంది. పైగా ఈ విషయాన్ని తాము తవ్వి తీశామని.. దీనిని మీడియా హైలెట్ చేయడంలో విఫలమైందని.. మీడియా కూడా మోడీకి అమ్ముడు పోయిందని వ్యాఖ్యలు చేయడం గమనార్హం. ఈ మొత్తం అంశాలను గమనిస్తే.. ఇది కేవలం ఎన్నికలకు ముందు టీడీపీ చేస్తున్న వ్యూహం తప్ప మరొకటి లేదనే విషయం స్పష్టంగా తెలుస్తోంది. మరి ఇలాంటి వ్యూహాలు ఏమేరకు ఎన్నికల్లో ఫలితాన్ని ఇస్తాయనేది ప్రశ్నార్థకం. ఏదైనా ఉంటే.. విధాన పరంగా విమర్శలు, ప్రతివిమర్శలు చేసుకోవడం తప్పుకాదు కానీ.. ఇలా ఏమీలేని విషయాలను వెలుగులోకి తీసుకువచ్చి విమర్శలు గుప్పించడం ఎందుకు ? అనేది అంతుచిక్కని ప్రశ్న.

# ఘాట్ రోడ్డులో వన్యమృగాలు

తిరుమల, ఏప్రిల్ 15, (న్యూస్ పల్స్) నిత్యం భక్తుల గోవింద నామాలతో మారుమోగే తిరుమలగిరుల్లో లాక్‌డౌన్‌తో రెండు వారాలుగా నిశ్శబ్ద వాతావరణం నెలకొనడంతో వన్యమృగాలు జన సంచారంలోకి వచ్చేస్తున్నాయి. మనుషుల అలికిడి లేకపోవడంతో శేషాచల అడవుల్లోని జంతువులు తిరుమల వీధుల్లోకి వచ్చి స్థానికులను, ఉద్యోగులను భయభ్రాంతులకు గురిచేస్తున్నాయి. అటవీ ప్రాంతానికి సమీపంలో ఉన్న కల్యాణ వేదిక, శ్రీవారి సేవ సదన్ వద్ద చిరుత, ఎలుగు బంట్లు సంచరిస్తున్నట్లు అటవీ శాఖ అధికారులు గుర్తించారు. మ్యూజియం వెనుక భాగంలో ఉన్న అటవీ ప్రాంతంలో రేసు కుక్కలు దుప్పిలపై దాడికి దిగిన ఘటనలతో స్థానికులు ఉలిక్కిపడ్డారు. స్థానికులు నివాసం ఉంటున్న బాలాజీ నగర్, ఈస్ట్ బాలాజీ నగర్లలో సైతం చిరుతలు, అడవి పందులు, దుప్పి, పాముల సంచారం అధికంగా ఉంటోంది. ఇక పాపవినాశనం మార్గంలో గజరాజుల గుంపు సంచరిస్తోంది. ముఖ్యంగా రెండు ఘాట్ రోడ్లలో చిరుతల సంచారం పెరిగింది. నాలుగు రోజుల క్రితం రెండు ఘాట్ రోడ్లను అనుసంధానం చేసే లింక్ రోడ్డులో చిరుత కనపడింది. దీంతో అక్కడ విధుల్లో ఉన్న సిబ్బంది భయభ్రాంతులకు గురి అయ్యారు. మొదటి ఘాట్ రోడ్డుపై జింకలు, కణితి, దుప్పిలు సైతం గుంపులు గుంపులుగా తిరుగుతున్నాయి. వన్య మృగాలు జనావాసంలోకి వస్తుండడంతో సాయంత్రం తరువాత బయట తిరగరాదని టీటీడీ, పోలీసు అధికారులు స్థానికులకు గట్టి ఆంక్షలు విధించారు. 1900 తర్వాత నుంచి తిరుమలకు భక్తుల రాక క్రమంగా పెరుగుతూ రావడంతో వన్యమృగాలు జనసంచారంలోకి రావడంతో క్రమంగా తగ్గిపోతూ వచ్చింది. ఇప్పుడు ఏకంగా రెండు

వారాలుగా ఆలయం మూత, ఘాట్‌రోడ్లపై రాకపోకల నిషేధంతో ఒక్కసారిగా నిశ్శబ్దం ఆవరించింది. దీంతో వన్యమృగాలు స్వేచ్ఛగా తిరుమల వీధుల్లోకి ఘాట్ రోడ్లపైకి వచ్చేశాయి. 128 ఏళ్ల క్రితం మాత్రం ఒకసారి రెండు రోజుల పాటు గుడి మూతపడిన సమయంలో ఇలాంటి పరిస్థితి కనిపించింది. అప్పట్లో ఆలయం చుట్టూ దట్టమైన అటవీ ప్రాంతం కావడం, శ్రీవారి ఆలయం మాత్రమే తిరుమలలో ఉండడంతో ఉదయం తిరుపతి నుంచి గుర్రాలపై అర్చకులు తిరుమలకు చేరుకునేవారు. సంధ్యా సమయం మొదలు కాకముందే తిరుపతికి తిరుగు ప్రయాణం అయ్యేవారు. ఇప్పుడు మళ్లీ అలాంటి వాతావరణం కనిపిస్తోంది.

# కొంపముంచిన ఆత్యాశ

అనంతపురం ఏప్రిల్ 15 న్యూస్ పల్స్)అత్యాశ వారి కొంప ముంచింది. కాసుల కోసం కక్కుర్తి పడితే నిండా మునిగి పోయారు. రాజులు పోయారు. రాజ్యాలు పోయాయి. ఇప్పుడున్న హైటెక్ యుగంలో కూడా అత్యాశ వల్ల లక్షలు పోగొట్టుకుంటున్నారు. కరువు సీమలో వైట్ కాలర్ నేరగాళ్లు ఎక్కువ అయ్యారు. పంటలు పండక నష్టాల్లో కూరుకు పోయిన రైతన్నలు లక్ష కడితే నెలకు 30 వేలు అదనంగా వస్తాయని చెబితే డబ్బులు కట్టి రైతన్నలు నిండా మునిగి పోయారు ఒకరు కాదు ఇద్దరు కాదు ఏకంగా వందల మంది రైతన్నలు సుమారు 300 కోట్లు పోగొట్టుకున్నారు. రైతన్నలు నిండా మునిగిపోయిన ఈ సంఘటన అనంతపురం జిల్లాలో చోటు చేసుకుంది.అనంతపురం జిల్లాలో ఈబిడ్ కంపెనీ పేరుతో నాగపూర్ చెందిన సునీల్ ఎండీగా సుధాకర్ నాయుడు మహేందర్ చౌదరి లతో కలిసి అనంతపురం జిల్లా వ్యాప్తంగా 300 కోట్లు నిండా ముంచేశాడు అనంతపురం జిల్లాలో బ్రాంచిలు ఓపెన్ చేసి నెలకి లక్ష కి 40,000 అదనంగా ఇస్తానని నమ్మబలికి రైతుల వద్ద కోట్ల రూపాయలు వసూలు చేశారు.2018 నుంచి ఇప్పటివరకు సుమారు జిల్లావ్యాప్తంగా 300 కోట్లు వసూలు చేశారని బాధితుల వాపోయారు.అనంతపురం జిల్లా వ్యాప్తంగా నెల రోజుల నుంచి డబ్బు ఇచ్చిన రైతులు వారిని నమ్మి డబ్బులు ఇచ్చిన వారు ఏజెంట్ల ద్వారా రైతులు నిండా మునిగి పోయారు. .చేసేదేమీలేక నేడు జిల్లా ఎస్పీని ఆశ్రయించారు. జిల్లా ఎస్పీ కేసు నమోదు చేసి విచారణ వేగవంతం చేశారు.వారితో కూలంకుషంగా కేసు విషయమై ఎస్పీ బంగ్లాలో విచారణ చేపట్టారు. బాధితుల నుంచి వివరాలు తీసుకున్నారు ఎండి సునీల్ జిల్లాకు చెందిన ఇద్దరు ప్రధాన సూత్రధారులు మహేందర్ చౌదరి, సుధాకర్ నాయుడు లు వీరిపై కేసు నమోదు చేయాలని అధికారులకు ఆదేశాలు జారీ చేశారు నష్టపోయిన రైతులను వారికి సంబంధించిన ఏరియాలో ఫిర్యాదు ఇవ్వాలని వెంటనే కేసు నమోదు చేయాలని అధికారులను ఆదేశించారు జిల్లా వ్యాప్తంగా వైట్ కాలర్ నేరగాళ్ల ఎక్కువ అవుతున్నారని వారి భరతం పడతామని జిల్లా ఎస్పీ భరోసా ఇచ్చారు..

# పది రోజులు కొకసారే నీళ్లు



అనంతపురం, ఏప్రిల్ 15, (న్యూస్ పల్స్)అనంతపురం జిల్లాలో రోజురోజుకు నీటికష్టాలు పెరిగిపోతున్నాయి. పదిరోజులకు ఒకసారి నీళ్లు వస్తుండడంతో ప్రజలు దాహంతో అలమటిస్తున్నారు. ప్రభుత్వం టాంకర్ల ద్వారా ఉప్పు నీటిని సరఫరా చేస్తుండడంతో దిక్కుతోచని స్థితిలో పడ్డారు. అటు తాగడానికి పనికిరాని నీటిని సరఫరా చేస్తున్న అధికారుల తీరుపై మండిపడుతున్నారు.అనంతపురం మీదుగా నేషనల్ హైవే 44 వెళుతుండడంతో.. ఈ పరిసర ప్రాంతాల్లో, కొందరు అక్రమ నివాసాలేర్పరుచుకున్నారు . పేరుకేమో అనంతపురం శివారు ప్రాంతమే అయినప్పటికీ, ఈ కాలనీలు మాత్రం అటు నగర కార్పొరేషన్ పరిధిలోకి రావు. మరోవైపున, గ్రామపంచాయితీలు కూడా వీరిని నిర్లక్ష్యం చేస్తున్నాయి. . శివారు ప్రాంత పేద ప్రజలు తాగునీటికోసం అలమటిస్తున్నారు. కూలి పనులు కావాలంటే నీటిని, నీళ్ళుకావాలంటే పనులను వదులుకోవాల్సిన దుస్థితి. నగరానికి నీటిని సరఫరా చేసే పైపులైనుకు గండికొట్టి, తమ గ్రామపంచాయితీలకు నీటిని మళ్ళించుకున్న నగరశివారు ప్రాంత ప్రజలు, భవిష్యత్తులో జరగబోయే జలయుద్ధాలకు శంఖమూదుతున్నారు. పగ్రామీణ ప్రాంతాల నుండీ వచ్చిన వీరందరూ దినకూలీలుగా జీవనం సాగిస్తున్నారు. వీరి సమస్యలకు తోడుగా,వేసవిలో తాగునీటి సమస్యకూడా అదనంగా వచ్చిచేరింది. పాపంపేట పంచాయితీ, వడ్డేకాలనీ, విద్యారణ్యనగర్ లతో పాటుగా మరికొన్ని ప్రాంతాల్లో సమస్య తీవ్రంగా ఉంది.తమ సమస్యను ఎన్నిసార్లు అధికారుల దృష్టికి తీసుకుపోయినా.. పెద్దగా పట్టించుకోవడం లేదని ఆరోపణలు వినిపిస్తున్నాయి.అనంతపురం నగరానికి నీరుసరఫరా చేసే పైపులైనుకు గండికొట్టి, తమపంచాయితీలకు నీటిని మళ్ళించారు కొందరు. పైపులైనుకు గండికొట్టడంతో,నగరంలోని పాతఊరు,ఇతర 8డివిజన్లలో నీటికొరత మొదలైంది. తాగడానికి నీళ్ళు దొరక్క, ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు.అనంతపురంలోని పాతఊరు,రాణినగర్,ఇతరప్రాంతాల్లో తీవ్రతాగునీటిఎద్దడి వుంది. నిర్దేశించిన సమయం కంటే,మూడు నెలలకు ముందే హెచ్చెల్సీ కెనాల్ కు నీరు విడుదలచేయడం ఆపేశారు. దీంతో,స్టోరేజ్ కెపాసిటీ తగ్గింది. .పాతఊరిలో పూలవ్యాపారులు ఎక్కువ ఇబ్బంది పడుతున్నారు. ఈ ఎండలకు తమ పూలు వాడిపోతే, వ్యాపారం దెబ్బతింటుంది. తమ వ్యాపారం కోసం, రోజుకు 150 రూపాయలు ఖర్చుపెట్టికొన్న మినరల్ వాటర్ తో పూలను తడుపుతున్నామంటున్నారు.తాగు నీటి కోసం ఉప్పు నీటిని పంపుతున్నఅధికారుల తీరుపైనా... మండిపడుతున్న స్థానికులు ఉన్న నీటిని పట్టుకునేందుకు సిగపట్లు పడుతున్నారు. నీళ్లు తాగాలంటే.. పని మానేయాల్సిన పరిస్థితి నెలకొంది.

# ఏడాదిలో 50 కు పైగా పెరిగిన స్లమ్స్

విశాఖపట్టణం, ఏప్రిల్ 15, (న్యూస్ పల్స్)రాష్ట్ర విభజన తర్వాత వైజాగ్ జెట్ వేగంతో దూసుకుపోతోంది. ఇప్పటికే కేంద్ర ప్రభుత్వం కూడా స్మార్ట్ సిటీ జాబితాలో విశాఖను చేర్చారు. వేలాది కోట్లతో నగరాన్ని అద్భుతంగా తీర్చిదిద్దుతామని పాలకులు ప్రకటించారు.అయితే.. పాలకులు ఊదరగొట్టిన అభివృద్ధి ఏదీ నగరంలో కనిపించడం లేదు. స్లమ్స్ లేకుండా చేస్తామని చెప్పిన ప్రభుత్వం ఆ దిశగా అడుగులు వేస్తున్న దాఖలాలు కనిపించడం లేదు. 632 వందల చదరపు కిలోమీటర్లు ఉన్న విశాఖ నగరంలో కేవలం 0.6 చదరపు కిలోమీటర్ల విస్తీర్ణాన్ని మాత్రమే స్మార్ట్ సిటీగా ప్రకటించారు. మరో వైపు సీటి విస్తీర్ణం పెరగడంతో... అదే లెవల్ లో స్లమ్స్ పెరుగుతున్నాయి.మురికివాడల సంఖ్యను తగ్గించేందుకు వందల కోట్లు ఖర్చు చేశామని ప్రభుత్వం చెప్పుతున్నప్పటికీ.. పట్టణ పేదరిక నిర్మూలన సంస్థ తాజాగా చేపట్టిన సర్వేలో 2013లో నగరంలో 741 ఉన్న స్లమ్స్ ఉండగా.. అవి 790కి పెరిగాయని ప్రకటించింది. అదేవిధంగా మురికివాడల్లో ఉండే జనాభా సంఖ్య 352 శాతం పెరిగింది. ఇది ఇలాగే కొనసాగితే విశాఖ నగరం ముంబయి తరహాలో మురికివాడల నగరంగా మారే ప్రమాదం ఉందని పలువురు హెచ్చరిస్తున్నారు.ఇక మురికివాడల నిర్మూలనకు జీవీఎంసీ బడ్జెట్‌లో 40 శాతం నిధులు కేటాయించాలని నిబంధన ఉన్నప్పటికీ పాలకులు అవేమీ పట్టించుకోవడం లేదు. దీంతో క్రమక్రమంగా స్లమ్స్ పెరిగిపోతున్నాయి.

# జనసేనతో పొత్తుపై మీమాంస

విజయవాడ, ఏప్రిల్ 14, (న్యూస్ పల్స్)ప్రస్తుతం రాష్ట్రంలో ప్రధాన ప్రతిపక్షంగా ఉన్న టీడీపీ ఉనికికోసం పాట్లు పడాల్సిన పరిస్థితి ఏర్పడింది. 2019 ఎన్నికల సమయంలో తీవ్రంగా దెబ్బతిన్న పార్టీని గాడిలో పెట్టేందుకు చంద్రబాబు ప్రయాసపడుతున్నారు. ఈ క్రమంలోనే ఇటీవల జరిగిన స్థానిక ఎన్నికల్లో పట్టు సాధించాలని అనుకున్నారు. అయితే.. అది సాధ్యం కాలేదు. ఈ క్రమంలోనే సరికొత్త ఫార్ములా ఒకటి తెరమీదికి వచ్చింది. బీజేపీతో జట్టుకట్టి.. రంగంలోకి దిగిన జనసేనకు బీజేపీ వల్ల ఎలాంటి ఫలితం దక్కలేదు. అయితే.. జనసేన ఒంటరిగా బరిలో నిలిచిన చోట గెలుపు గుర్రం ఎక్కినా ఎక్కకపోయినా.. ఓట్లు మాత్రం బాగానే రాబట్టింది. టీడీపీ ఒంటరిగా పోటీ చేసిన చోట ఆ పార్టీ కూడా బాగానే ఓట్లు సాధించింది అంటే.. ప్రభుత్వ ఓట్లు.. ఇక్కడ చీలిపోయాయనేది స్పష్టంగా కనిపిస్తోంది. ఇక, ఈ క్రమంలోనే టీడీపీ సీనియర్లు.. ఒక సరికొత్త వాదనను తెరమీదికి తెస్తున్నారు. జనసేనతో కలిసి ముందుకు సాగితే.. టీడీపీ ఉనికి నిలబడుతుందనేది వారి వాదన. అదే సమయంలో జనసేనకు కీలకమైన నియోజక వర్గాలు వదిలి పెట్టాలని కూడా వీరు సూచిస్తుండడం గమనార్హం. అలా అయితేనే జనసేన కూడా పార్టీతో మనస్ఫూర్తిగా కలిసి వస్తుందని టీడీపీలో కొందరు కాపు నేతలు, సీనియర్లు చంద్రబాబుకు సూచించినట్టు తెలిసింది.అయితే ఈ పరిణామంతో పార్టీ దెబ్బతింటుందనే జంకు కూడా కొందరిలో కనిపిస్తోంది. దీనిపై జనసేనకు చెందిన కొందరు నేతలతో టీడీపీ నేతలు ప్రాథమికంగా చర్చిస్తున్నారు కూడా..! వచ్చే ఎన్నికల్లో వైసీపీని అధికారం నుంచి గద్దె దింపాలంటే ఖచ్చితంగా మన రెండు పార్టీలు పొత్తులతోనే ముందుకు సాగాలని విజయవాడకు చెందిన జనసేన కీలక నేత టీడీపీ ముఖ్య నేతలతో జరిగిన చర్చల్లో అన్నారు. ఈ క్రమంలోనే ఆయన విజయవాడలో తూర్పు సీటు తమకు ఇస్తే బాగుంటుందని కూడా చెప్పారట. అయితే ఇది జరిగే పనికాదు? విజయవాడ తూర్పు నియోజకవర్గంలో టీడీపీకి బలం ఉంది. కానీ.. ఇప్పుడు ఇలాంటి చోట జనసేన పోటీ చేయాలని కోరుతోంది.అక్కడ టీడీపీకి సీనియర్ నేత, సిట్టింగ్ ఎమ్మెల్యే గద్దె రామ్మోహన్ ఉన్నారు. రేపు కనుక టీడీపీ.. జనసేనతో పొత్తు పెట్టుకుంటే.. ఇలాంటి సీట్లను జనసేనకు వదిలేయాలి. టీడీపీకి బలమున్న సీట్లనే రెండు పార్టీలో కోరితే ఆ పొత్తు ఎంత వరకు కలిసొస్తుందో ? చెప్పలేం. జనసేన ఎక్కడ కోరుకుంటే.. అక్కడ టికెట్లు కేటాయించాలి. కనీసం 30-50 స్థానాల్లో జనసేన కోరితే.. ఖచ్చితంగా ఇవ్వగలగాలి. అవికూడా టీడీపీకి పట్టున్న చోట కోరినా కాదనే పరిస్థితి ఉండదు.నేపథ్యంలో ఇప్పుడు ఇలాంటి ఫార్ములా అవలంబిస్తే.. టీడీపీకి ఆయువు పట్టు వంటి నియోజకవర్గాల్లో జనసేన బలపడడం ఖాయంగా కనిపిస్తుండగా.. టీడీపీ మాత్రం పోరాటం చేయాల్సిన పరిస్థితి ఉంటుంది. అప్పుడు మరి కొంత మంది పార్టీ నేతలు కూడా పార్టీని వీడే అవకాశం ఉంది. ఇది పార్టీకి ఎలా మేలు చేస్తుందో పార్టీ మేధావులు సెలవివ్వాల్సిన అవసరం ఉంది. కానీ, వారు మాత్రం టీడీపీ నెగ్గాలంటే.. ఖచ్చితంగా జనసేనతో ముందుకు సాగి.. దానిని మచ్చిక చేసుకోవాలనే ప్రతిపాదనను తెరమీదికి తెస్తున్నారు. మరి దీనిని చంద్రబాబు పాటిస్తారో లేదో చూడాలి

# చంద్రబాబు ఉత్సాహం దేనికి కారణం



తిరుపతి, ఏప్రిల్ 15, (న్యూస్ పల్స్)తిరుపతి ఉప ఎన్నికలో సత్తా చాటాలని నిర్ణయించుకున్న టీడీపీ అధినేత చంద్రబాబు.. స్థానిక ఎన్నికల ఫలితాల్లో తగిలిన ఎదురు దెబ్బల నుంచి వెంటనే తేరుకున్నారు. శ్రేణులను ఉత్సాహ పరుస్తూ.. తిరుపతి ఉప పోరులో ఆయన ప్రచారం చేశారు. అయితే.. నాణేనికి ఇది ఒకవైపు మాత్రమే. తాజాగా ఆయన అంతర్గతంగా చేయించుకున్న ఓ సర్వేలో.. వైసీపీకి ఎదురుదెబ్బ తగలడం ఖాయమని.. టీడీపీ గట్టి పోటీ ఇస్తోందని తేలిందట. అంతేకాదు.. మరింతగా కష్టపడితే.. పట్టణ ప్రాంతాల్లోని ఓటర్లు.. వైసీపిని వీడి.. టీడీపీ బాటపట్టే అవకాశం ఉందని తేలినట్టు టీడీపీ నేతల మధ్య వినిపిస్తోంది.పరిణామంతో చంద్రబాబు మరింత ఉత్సాహంతో చేశారు. జగన్ ప్రవేశ పెడుతున్న పథకాల్లో చాలా వరకు కొద్ది మందికి మాత్రమే లబ్ధి చేకూరుస్తున్నాయి. దీంతో మిగిలిన వారు సైలెంట్‌గా ఉన్నారు. గత స్థానిక ఎన్నికల్లో కూడా వీరు ఓటు వేయడానికి రాలేదు. దీంతో వీరిని కనుక ఓటు వేసేలా ప్రోత్సహించినట్టయితే.. అది తమకు అనుకూలంగా మారుతుందని టీడీపీ నేతలు చేసిన సర్వేలో స్పష్టమైంది. మొత్తంగా పార్లమెంటు నియోజకవర్గ పరిధిలో ఏడు నియోజకవర్గాల్లోని ఐదు నియోజకకవర్గాల్లో టీడీపీ నేతలు సర్వే చేయించారు. అయితే.. ఈ ఐదు నియోజకవర్గాల్లోనూ ఆశించిన విధంగానే ఫలితాలు వచ్చాయట. స్థానిక ఎన్నికల్లో టీడీపీకి జరిగిన అన్యాయంపై కొంత సింపతీ కూడా జోడైందని తెలిసింది.సమయంలో తిరుపతిలో జరుగుతున్న అన్యమత ప్రచారం.. అభివృద్ధి జరగని విధానం.. తిరుమల మొత్తాన్నీ రెడ్డి సామాజిక వర్గమే ఆక్యుపై చేయడం వంటివి ప్రజల మధ్య చర్చకు వస్తున్నాయి. బలిజ వర్గం ఓటర్లలో కూడా చంద్రబాబే నయం.. కాస్తో కూస్తో తమకు మేలు చేశాడని.. ఈ ప్రభుత్వంతో ఒరిగింది లేదని చర్చ స్టార్ట్ అయ్యిందంటున్నారు. ముఖ్యంగా తిరుపతి, శ్రీకాళహస్తి నియోజకవర్గాల్లో బలిజ ఓటర్లలో మార్పు ఎక్కువగా ఉందంటున్నారు.ఆయా అంశాలను కనుక టార్గెట్ చేసుకుంటే.. చంద్రబాబుకు ఆశించిన విధంగానే ఇక్కడ ప్రజలు పట్టం కడతారని సర్వేలో స్పష్టమైనట్టు తమ్ముళ్ల మధ్య గుసగుస వినిపిస్తోంది. ముఖ్యంగా నెల్లూరులో ఇప్పుడు వైసీపీ నేతల మధ్య అసంతృప్తి సెగలు కక్కుతోంది. ఈ క్రమంలో అభివృద్ధి కూడా ముందుకు సాగడం లేదు. దీంతో ఇక్కడ ఎక్కువగా టీడీపీకి సానుకూలత ఉన్నట్టు పార్టీ నేతలు గ్రహించారు. అందుకే ఎక్కువగా నెల్లూరును టార్గెట్ చేసుకుని చంద్రబాబు ముందుకు సాగుతున్నారు. మరి ఏం జరుగుతుందో చూడాలి.

## ఒకే ఇంట్లో నలుగురు సజీవ దహనం

విశాఖపట్నం విశాఖపట్టణంలోని మధురవాడలో ఈ దారుణ ఘటన చోటుచేసుకుంది ఒకే కుటుంబానికి చెందిన వ్యక్తులు ఓ ఇంట్లో సజీవదహనమయ్యారు. స్థానికులు చెప్పిన కథనం ప్రకారం మధురవాడలోని ఆదిత్య ఫార్చున్ టవర్లో ఫ్లాట్ నెంబర్ 505 లో అర్ధరాత్రి అగ్నిప్రమాదం జరిగింది. ఆ ఫ్లాట్ నుంచి భారీగా మంటలు చెలరేగాయి పెద్ద ఎత్తున పొగలు, మంటలు కనిపించడంతో మిగతా ఫ్లాట్స్ వారు భయభ్రాంతులకు లోనయ్యారు. సమాచారం అందుకున్న పోలీసులు, అగ్నిమాపక సిబ్బంది ఘటనా స్థలానికి చేరుకొని మంటలను అదుపుచేశారు ఐతే అప్పటికే జరగాల్సిన నష్టం జరిగిపోయింది. ఆ ఇంట్లో ఉన్న నలుగురు వ్యక్తులు సజీవ దహనమయ్యారు మృతులు బంగారునాయుడు (50), డాక్టర్ నిర్మల (44), దీపక్ (21), కశ్యప్ (19) గా పోలీసులు గుర్తించారు విజయనగరం జిల్లా గుంట్యాడకు చెందిన ఈ ఎన్నారై కుటుంబం.. బహ్రెయిన్లో స్థిరపడింది. నాలుగేళ్ల క్రితం తిరిగి విశాఖపట్టనానికి వచ్చారు 8 నెలల క్రితమే ఆదిత్య ఫార్చున్ టవర్స్‌కి అద్దెకు వచ్చారుఆ అపార్ట్మెంట్లో ఓ ఫ్లాట్నుఅద్దెకు తీసుకొని నివసిస్తుండగా ఈ ఘటన జరిగింది ఘటనపై కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు వెల్లడించారు మృతుల కుటుంబ సభ్యులను అడిగి పోలీసులు వివరాలు సేకరిస్తున్నారు ఇది ప్రమాదవశాత్తు జరిగిందా? ఎవరైనా హత్య చేశారా? లేదంటే వారే ఆత్మహత్య చేసుకున్నారా?అన్ని కోణాల్లో పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు అపార్ట్మెంట్ చట్టుపక్కల ఉన్న సీసీ కెమెరాల ఆధారంగా పోలీసులు విచారణ చేస్తున్నారు.

# టీడీపీలోకి జూనియర్లు రారు

విజయవాడ, ఏప్రిల్ 15, (న్యూస్ పల్స్)నిజమే! టీడీపీలో ఈ ఆవేదన ఇప్పుడు కొత్తగా వచ్చింది కాదు. దాదాపు పార్టీ అధికారంలోకి వచ్చిన 2014-16 సంవత్సరాల మధ్య జోరుగా సాగింది. అయితే.. అప్పట్లో పార్టీ అధికారంలోకి రావడంతో పార్టీ అధినేత కూడా లైట్ తీసుకున్నారు. తాము చేస్తున్న అభివృద్ధిని , తనను చూసి ప్రజలు గెలిపిస్తారని అనుకున్నారు.కానీ, అనూహ్యంగా పార్టీ ఓడిపోయింది. దీనికి తోడు వైసీపీ సర్కారు ఏర్పడిన తర్వాత.. పార్టీ నుంచి వలసలు ప్రారంభమయ్యాయి. తిరుపతి ఉప ఎన్నిక తర్వాత కూడా పార్టీ నుంచి వలసలు పెరిగే అవకాశం మెండుగా ఉందని అంటున్నారు. ఈ నేపథ్యంలో ఇప్పుడు ఏం చేయాలనే విషయంపై చర్చిస్తున్నారు.ఈ విషయం చర్చకు రాగానే పార్టీ అధినేత చంద్రబాబు వద్దకు ఒక ప్రతిపాదన వచ్చింది. యువతకు ప్రాధాన్యం పెంచండి అని? అయితే.. ఆయన ఇప్పటికే పెంచాం కదా.. ఇప్పుడు కొత్తగా చేసేది ఏముంటుంది? అని ప్రశ్నించారని తెలిసింది. దీనికి కొందరు సమాధాన మిస్తూ.. పదవులు అయితే.. ఇచ్చారు సార్.. కానీ వారికి వాయిస్ ఇవ్వలేదు! అని జవాబు చెప్పారట. అంటే.. పార్టీలోకి యువ రక్తం ఎక్కించడం అంటే.. పదవుల్లో యువతను కూర్చోబెట్టడం మాత్రమేనని ఇప్పటి వరకు చంద్రబాబు భావిస్తూ వచ్చారు. కానీ, అలా కాదని.. వారికి కూడా కొన్ని అధికారాలు వెసులుబాట్లు.. మీడియా ప్రతినిధులుగా మాట్టాడే ఛాన్స్ ఇవ్వాలని కొందరు విన్నవించారు.ఒక్కసారిగా ఇదో చిత్రమైన విషయం అంటూ.. చంద్రబాబు ఆలోచనలో పడ్డారు. నిజమే ఇప్పటి వరకు పార్టీలో యువతకు ప్రాధాన్యం ఇస్తున్నానని చెప్పిన చంద్రబాబు.. వారికి పదవులు ఇచ్చారు. కానీ, వాయిస్ మాత్రం ఇప్పటికీ సీనియర్ల వద్దే ఉంది. మాజీమంత్రులు, కురువృద్ధ నేతలు మాత్రమే పార్టీ తరఫున మాట్లాడుతున్నారు. ఇంకా పార్టీ ఆవిర్భావం నుంచి ఉన్న నేతలే చంద్రబాబు చెవిలో జోరిగల్లా ఉన్నారు. పార్టీ చాలా వరకు దెబ్బతినడానికి వీరి నిర్ణయాలే అని పలువురు మొత్తుకుంటున్నా కూడా చంద్రబాబు ఇప్పటి వరకు పట్టించుకున్న దాఖలాలు లేవు.దీంతో పదవులు ఇచ్చినా తమ మాటకు విలువ లేకపోవడంతో యువత కేవలం నోరెళ్లబెట్టి చూస్తోంది. ఈ విధానం మారాల్సిన అవసరం ఉందనేది నేటి యువత అడుగుతున్న ప్రశ్న. సో.. వారికి కూడా వాయిస్ వినిపించే అవకాశం. మీడియాలో కనిపించే అవకాశం ఇవ్వడం ద్వారానే ఉత్సాహం రెట్టింపు అవుతుందని.. ఆదిశగా ప్రణాళికలు సిద్ధం చేయాలని భావిస్తున్నారని తెలుస్తోంది. మరి ఇది ఏ మేరకు వర్కవుట్ అవుతుందో చూడాలి.

## ఒంగోలులో హత్య.. ఆత్మహత్య

ఒంగోలు, ఏప్రిల్ 15, (న్యూస్ పల్స్)ప్రకాశం జిల్లాలో విషాద ఘటన జరిగింది. ప్రేమ పెళ్లి చేసుకున్న భార్యాభర్తల మరణం కలకలంరేపింది. ఒంగోలుకు చెందిన కబాలి నాగరాజు, మద్దిపాడు మండలం ఏడుగుండ్లపాడుకు చెందిన శ్రీవల్లి మూడేళ్ల క్రితం ప్రేమించి పెళ్లి చేసుకున్నారు. ఒంగోలులోని హిల్‌కాలనీలో ఇల్లు అద్దెకు తీసుకుని ఉంటున్నారు. నాగరాజు ఆటోడ్రైవర్‌గా.. శ్రీవల్లి ఓ షాపులో పనిచేస్తున్నారు. ఇటీవల ఇద్దరి మధ్య గొడవలు జరిగాయి. నాగరాజుపై శ్రీవల్లి దిశ పోలీసుస్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. నాగరాజు తమ అద్దె ఇంటికి సమీపంలోని తల్లిదండ్రుల దగ్గరకు వెళ్లగా.. శ్రీవల్లి మాత్రం అద్దె ఇంట్లో ఉంటోంది. ఉదయం టంగుటూరు మండలం మర్లపాడు దగ్గర చెరువులో ఓ మృతదేహాన్ని స్థానికులు గుర్తించారు. వెంటనే పోలీసులకు సమాచారం ఇవ్వగా..మృతుడి దగ్గర దొరికిన మొబైల్ ఆధారంగా నాగరాజుగా గుర్తించారు. తల వెనుక భాగంలో, గొంతుపై గాయాలున్నాయి. దీంతో నాగరాజు హత్యకు గురైనట్లు పోలీసులు శ్రీవల్లికి ఫోన్ చేసి చెప్పారు. అప్పటికే తన రెండో కుమార్తెను ఆసుపత్రిలో చూపించేందుకు శ్రీవల్లి తల్లి రమాదేవి ఒంగోలు వచ్చారు. అల్లుడి హత్య విషయం తెలిసి ఇద్దరూ శ్రీవల్లి ఉంటున్న ఇంటికి వెళ్లారు. అదే సమయంలో ఓ ఎస్సై, ఇద్దరు కానిస్టేబుళ్లు వచ్చి విచారణ నిమిత్తం స్టేషన్‌కు రావాలని శ్రీవల్లిని కోరారు.ఇంట్లోకి వెళ్లి పర్సు తీసుకుని వస్తానని పోలీసులతో చెప్పి గదిలోకి వెళ్లిన శ్రీవల్లి ఎంతసేపటికీ బయటకు రాలేదు. అనుమానంతో తల్లి రమాదేవి లోపలికి వెళ్లేసరికి ఉరికి వేలాడుతూ కనిపించారు. శ్రీవల్లి మృతిపై ఒంగోలు వన్ టౌన్ పోలీసులు కేసు నమోదు చేశారు. నాగరాజు హత్య, శ్రీవల్లి ఆత్మహత్యలకు గల కారణాలపై పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు. అల్లుడు, కూతురు చనిపోవడంతో తల్లి రమాదేవి కన్నీళ్లు పెట్టుకున్నారు.

## సాలూరు ఆసుపత్రిలో సీఐడీ సోదాలు

విజయనగరంవిజయనగరం జిల్లా సాలూరు పట్టణంలో స్థానిక ప్రభుత్వ ఆసుపత్రిలో బయో మెడికల్ పరికరాల పై సిఐడి విశాఖపట్నం వారు తనిఖీలు నిర్వహించారు. బుధవారం సి ఐ డి ఎం.వి గణేష్ ఎస్ ఐ ఆధ్వర్యంలో స్థానిక ప్రభుత్వ ఆసుపత్రిలో తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ ఆస్పత్రిలో ఉన్న బయో మెడికల్ పరికరాలు 2015 నుంచి 2018 వరకు ఉన్న వాటిని తనిఖీ చేయడం జరిగింది. ఇందులో కొన్ని పరికరాలు పూర్తిగా మరమ్మతులకు గురయ్యాయి. అంతేకాక బయోమెడికల్ పరికరాలు సర్వీసింగ్ చేయిస్తే ఉపయోగపడతాయని పేర్కొన్నారు. కొన్ని సర్వీసింగ్ చేసిన వాటిపై బిల్లులు ఉన్నాయా లేదా అని వాటిపై కూడా తనిఖీలు చేశారు. ఆస్పత్రిలో ఉన్న సిబ్బంది ఈ బయో మెడికల్ పరికరాలను ఏ విధంగా ఉపయోగిస్తున్నారు వాటిపై ఎంత శ్రద్ధ తీసుకుంటున్నారని తెలుసుకోవడం జరిగింది అన్నారు. అలాగే 3 టీమ్స్ గా సిఐడి నాలుగు మండలాల్లో ఉన్న పి హెచ్ సి సిహెచ్ సీ మరియు అర్బన్ సెంటర్లను తనిఖీలు నిర్వహించడం జరిగింది అన్నారు. ఈ పర్యటనలో డాక్టర్ రామ్మూర్తి, సిఐడి శ్రీనివాస్ ఎస్ఐ, నాగేశ్వరరావు ఎస్ ఐ, సిబ్బంది పాల్గొన్నారు.

# కాంగ్రెస్ లో షర్మిల టెన్షన్

హైదరాబాద్, ఏప్రిల్ 15, (న్యూస్ పల్స్) వైఎస్ షర్మిల పార్టీ వైపు పేరున్న నేతలు ఎవరూ వెళ్లకుండా చూడాలని ఇప్పటికే హైకమాండ్ నుంచి ఆదేశాలు అందినట్లు తెలిసింది. షర్మిలను రాజకీయంగా తొలినాళ్లలోనే కంట్రోల్ చేయకపోతే ఇబ్బందులు తప్పవని గ్రహించిన కాంగ్రెస్ నాగార్జున సాగర్ ఉప ఎన్నికల తర్వాత పూర్తి స్థాయి కార్యాచరణ చేపట్టనున్నట్లు తెలిసింది.వైఎస్ షర్మిల పార్టీ పెడుతుండటంతో కాంగ్రెస్ లో కొత్త టెన్షన్ మొదలయింది. ఆంధ్రప్రదేశ్ లో జగన్, తెలంగాణలో సోదరి షర్మిల పార్టీని ఎదగనివ్వకుండా అడ్డుపడుతున్నారని కాంగ్రెస్ హైకమాండ్ దృష్టికి వెళ్లింది. దీంతో కాంగ్రెస్ ముందస్తు చర్యలను ప్రారంభించిందంటున్నారు. కాంగ్రెస్ కు ప్రధాన ఓటు బ్యాంకు రెడ్డి సామాజికవర్గంతో పాటు ఎస్సీ, ఎస్టీ, మైనారిటీ ఓట్లు. వీటిని ఏపీలో జగన్ తన పార్టీకి తీసుకెళ్లిపోయారు.తెలంగాణకు వచ్చే సరికి మైనారిటీలు టీఆర్ఎస్ వైపు మొగ్గు చూపుతున్నారు. ఎస్సీ, ఎస్టీలు ఒకింత కాంగ్రెస్ వైపే ఉన్నారని చెప్పాలి. వీరితో పాటు రెడ్డి సామాజికవర్గం కూడా కాంగ్రెస్ వైపే ఇప్పటి వరకూ ఉంది. బలమైన బీసీ ఓటు బ్యాంకు మాత్రం టీఆర్ఎస్ వైపు ఉండటంతో రెండుసార్లు అధికారంలోకి రాగలిగింది. ఇప్పుడు వైఎస్ షర్మిల పార్టీ పెడితే ఎస్సీ, ఎస్టీ ఓట్లతో పాటు రెడ్డి సామాజికవర్గం ఓట్లకు గండిపడే ప్రమాదముందన్న ఆందోళన కాంగ్రెస్ లో వ్యక్తమవుతుంది.దీంతో రెడ్డి సామాజకవర్గం వారిచేతనే తొలుత కౌంటర్ ఇప్పించాలని నిర్ణయించినట్లు కనపడుతుంది. మరోసారి కేసీఆర్ కు మేలు చేసేందుకే వైఎస్ షర్మిల కొత్త పార్టీ పెట్టారన్న ప్రచారాన్ని ఇప్పటికే కాంగ్రెస్ కిందిస్థాయిలోకి తీసుకెళ్లింది. బలమైన రెడ్డి సామాజికవర్గం నేతలు ఎవరూ వైఎస్ షర్మిల పార్టీ వైపు వెళ్లకుండా ముందుగా వారితో సమావేశాలు ఏర్పాటు చేసి భవిష్యత్ పై భరోసా కల్పించాలని కాంగ్రెస్ భావిస్తుంది.ముఖ్యంగా రేవంత్ రెడ్డి లాంటి నేతలకు షర్మిలకు వ్యతిరేకంగా గళం విప్పేలా చేయాలన్న యోచనలో ఉంది. దీంతో పాటు ఎస్సీ, ఎస్టీ ఓటు బ్యాంకు సయితం కోల్పోకుండా కాంగ్రెస్ దళిత నేతలను రంగంలోకి దింపాలని నిర్ణయించింది. వైఎస్ షర్మిల పార్టీ వైపు పేరున్న నేతలు ఎవరూ వెళ్లకుండా చూడాలని ఇప్పటికే హైకమాండ్ నుంచి ఆదేశాలు అందినట్లు తెలిసింది. షర్మిలను రాజకీయంగా తొలినాళ్లలోనే కంట్రోల్ చేయకపోతే ఇబ్బందులు తప్పవని గ్రహించిన కాంగ్రెస్ నాగార్జున సాగర్ ఉప ఎన్నికల తర్వాత పూర్తి స్థాయి కార్యాచరణ చేపట్టనున్నట్లు తెలిసింది.బీజేపీలో కనిపించని టెన్షన్ తెలంగాణలో వైయస్ షర్మిల విషయంలో బీజేపీ అధిష్ఠానం ఇప్పుడు జాగ్రత్తపడే అవకాశాలు ఉన్నాయి. బీజేపీ నుంచి ఎవరైనా వైయస్ రాజశేఖరరెడ్డి అభిమానులు ఆమె పార్టీలోకి వెళ్లే అవకాశం ఉందా అనే దానిపై ఆసక్తి కరంగా చూస్తున్నారు. కొంతమంది ఖమ్మం నల్గొండ జిల్లాలకు చెందిన నేతలు ఆమె పార్టీలోకి వెళ్లే అవకాశం ఉందని ఈ మధ్యకాలంలో వార్తలు వస్తున్నాయి. ఈ విషయంలో ఎటువంటి ముందడుగు పడుతుంది ఏంటి అనేది ఇంకా స్పష్టత లేదు.కొన్ని కొన్ని అంశాల్లో వైయస్ షర్మిల బీజేపీని కూడా గట్టిగానే టార్గెట్ చేయవచ్చు. బిజెపిలో దళిత సామాజిక వర్గాలకు న్యాయం జరుగుతుంది అనే అంశాన్ని ఆమె ప్రస్తావించే అవకాశం ఉంది. ఉత్తరాది రాష్ట్రాల్లో బిజెపి దళితులకు అన్యాయం చేస్తుందని కొన్ని పార్టీలు గత కొంతకాలంగా ఆరోపణలు ఎక్కువగా చేస్తున్నాయి. కాబట్టి షర్మిల కూడా తెలంగాణలో ఇదే అంశాన్ని ప్రస్తావించే అవకాశాలు ఉండవచ్చు అని సమాచారం.కాబట్టి చాలా జాగ్రత్తగా ఉండాలి అని బీజేపీ నేతలకు సూచనలు సలహాలు ఇస్తున్నారు. బిజెపి అగ్ర నాయకత్వం కూడా షర్మిల విషయంలో జాగ్రత్తగా ఉండి పార్టీలో నుంచి ఎవరు బయటకు వెళ్ళకుండా చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఉందని కోరుతున్నారు. బిజెపి లో చాలా వరకు కూడా భిన్నాభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. దీన్ని షర్మిల తనకు అనుకూలంగా మార్చుకునే అవకాశం ఉండవచ్చు అని సమాచారం.

## జంతువులకు కరోనా రాకుండా వ్యాక్సిన్

ఒంగోలు, ఏప్రిల్ 15, (న్యూస్ పల్స్) నల్లమల అటవీ ప్రాంతంలో ఉన్న పెద్దపులులు, చిరుతలు, ఎలుగుబంట్లు, జింకలు, ఇతర వన్యప్రాణులకు కరోనా వైరస్ సోకకుండా అటవీశాఖ అధికారులు ప్రత్యేక ఏర్పాట్లు చేస్తున్నారు. శ్రీశైలానికి వెళ్లే ఘాట్‌రోడ్డు, నడకమార్గం, ఇష్టకామేశ్వరి గుడి, ఎకో టూరిజం మూసేశారు. ప్రస్తుతం వాహనాల రద్దీ పూర్తిగా లేకపోవడంతో వన్యప్రాణులన్నీ రోడ్లపైకి వస్తున్నాయి. నల్లమలలో సుమారు 48 పెద్ద పులులు, 60కి పైగా చిరుత పులులు ఉన్నాయి. వేల సంఖ్యలో జింకలు, దుప్పులు, వందల సంఖ్యలో ఎలుగుబంట్లు ఉన్నాయి. వీటికి కరోనా వైరస్ సోకకుండా జాగ్రత్తలు తీసుకుంటున్నారు.అటవీ సమీప గ్రామాలలోని ప్రజలకు సిబ్బంది ద్వారా కరపత్రాలు పంచి అవగాహన కలి?పస్తున్నారు. ఇష్టకామేశ్వరి, ఎకోటూరిజం ప్రాంతాలను మూసివేయడంతో భక్తులు, సందర్శకుల రాక నిలిచిపోయింది. వేసవి కాలం కావడంతో నీటి సమస్య రాకుండా ప్రత్యేక చర్యలు తీసుకున్నారు. 24 బేస్ క్యాంప్‌లను ఏర్పాటు చేసి 120 మంది టైగర్ ట్రాకర్‌లను నియమించి పులుల కదలికపై నిఘాపెట్టారు. చెక్‌పోస్టుల వద్ద సిబ్బందిని ఎక్కువగా నియమించి ఎవ్వరినీ అటవీ ప్రాంతంలోకి పంపకుండా చర్యలు తీసుకున్నారు.వివిధ ప్రాంతాల్లో జంతువులకు నీటిని అందించేందుకు సాసర్‌పిట్‌లను ఏర్పాటు చేసి ట్యాంకర్‌ల ద్వారా నీటిని నింపుతూ జంతువులకు నీటి సమస్య లేకుండా చేస్తున్నారు. పట్టణాల్లో ఉన్న కోతులను ఇటీవల అటవీ ప్రాంతానికి తరలించారు. వాటి సంరక్షణకు కూడా చర్యలు తీసుకుంటూ పండ్లను అందిస్తున్నారు. చిన్న మంతనాల, చింతల, పెద్ద మంతనాల ప్రాంతాల్లో కోతుల కోసం స్టాల్‌ఫీట్స్‌ను ఏర్పాటు చేశారు.

## యువకుడి దారుణ హత్య

చిత్తూరుచిత్తూర్ జిల్లా కుప్పం మండలం లో యువకుడి దారుణ హత్య ఉదంతం వెలుగు చూసింది. కుప్పం - కృష్ణగిరి జాతీయ రహదారిలోని కుప్పం మండలం నడుమూరు సమీపంలోని బ్రిడ్జి కింద లగేజ్ బ్యాగ్ లో యువకుడి శరీర భాగం లభ్యమయింది. యువకుడిని దారుణంగా హతమార్చిన దుండగులు అతి కిరాతకంగా శరీరాన్ని రెండు ముక్కలు చేసి నడుము కింది భాగాన్ని ఓ ప్లాస్టిక్ కవర్ లో చుట్టి లగేజ్ బ్యాగ్ లో ప్యాక్ చేసి పడేసిన ఘటన కుప్పంలో కలకలం రేపుతోంది. కుప్పం - క్రిష్ణగిరి జాతీయ రహదారి లోని నడుమూరు గురుకుల పాఠశాల సమీపంలోని బ్రిడ్జి కింద ఓ లాగేజీ బ్యాగ్ పడి ఉండడాన్ని స్థానికులు గుర్తించి పోలీసులకు సమాచారం అందించారు. అయితే లగేజ్ బ్యాగ్ తెరిచి చూసిన పోలీసులు ఒక్కసారిగా షాక్ కు గురయ్యారు. మృతదేహాన్ని పోస్టుమార్టం కొరకు స్థానిక ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. ఇంకా పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది.

## మహిళ నేత పై దాడి అమానుషం

నందిగామ అధికార పార్టీ నాయకులు అహంకా రపూరితంగా వ్యవహరిస్తూ పచ్చని పల్లెటూర్లలో అశాంతిని సృష్టిస్తున్నా రని మాజీ శాసన సభ్యు రాలు తంగిరాల సౌమ్య అన్నారు.కృష్ణా జిల్లా నందిగామలో మాజీ శాసనసభ్యురాలు సౌమ్య మీడియాతో మాట్లాడుతూ చందర్లపాడు మండలం ముప్పాళ్ల గ్రామములో పరిషత్ ఎన్నికలలో భాగంగా గెలవలేమన్న అక్కసుతో తెలుగుదేశం మద్దతుదారురాలు అయిన బి.సి సంక్షేమ సంఘం జిల్లా నాయకురాలు పెంటి నాగమణి పై దాడి చేయడం హేయమైన చర్య అని, వైసీపీ గుండాలు నాగమణి ఇంటి వద్దకు చేరుకొని అసభ్యపదజాలంతో దూషించడంతో పాటు విచక్షణ రహితంగా దాడి చేసారని. ఒక వైపు మహిళల రక్షణ కోసం దిశ చట్టాన్ని తెచ్చాము అని ముఖ్యమంత్రి చెప్తుండగా ఆ పార్టీ గుండాలు మహిళలపై ఎద్దేచగా దాడులకు పాల్పడుతున్నారని అన్నారు.ఆ దాడికి పాల్పడిన వారిపై ఇంతవరకు చర్యలు తీసుకోకపోవడం దారుణమని ముప్పాళ్ళ గ్రామములో దాడులు చేసిన వారే తిరిగి టీడీపీ కార్యకర్తల పై అక్రమ కేసులు పెట్టించడం శోచనీయమని చెప్పారు.

# ప్రభుత్వ భూముల్లో అక్రమంగా సరుగుడు చెట్లు నరికివేత

### అడ్డుకున్న రెవెన్యూ అధికారులు

విశాఖపట్నం పరవాడ మండలంలో గల కలపాక పంచాయతీ స్వయంభువరం రెవెన్యూ పరిధి సర్వే నంబర్ 152/2 లోని ప్రభుత్వ భూముల్లోని సరుగుడు చెట్లను గుర్తుతెలియని వ్యక్తులు నరికి వేస్తున్నారని స్థానికులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు గురువారం ఉదయం రెవెన్యూ అధికారులు అడ్డుకున్నారు. రెండు రోజుల నుండి సరుగుడు చెట్లను నరికి వేస్తున్నారని బుధవారం రాత్రి 5 టన్నుల సరుగుడు కర్రలను తరలించారని రెవెన్యూ అధికారులకు స్థానికులు తెలిపారు. కాగా సరుగుడు చెట్లు ఉన్న భూమికి పట్టా ఉందని రెవెన్యూ అధికారులకు నమ్మబలికే ప్రయత్నం చేశారు. అయితే? భూమికి సంబంధించిన ఏమైనా పత్రాలు ఉంటే తక్షణమే తహాసిల్దార్ కార్యాలయానికి తీసుకువచ్చి చూపించాలని గ్రామ రెవెన్యూ అధికారి సూర్యనారాయణ సరుగుడు రైతులకు సూచించారు. అప్పటివరకు సరుగుడు చెట్లను నరక వద్దని సరుగుడు చెట్లు ఉన్న భూమికి డిపట్టా దారులుగా చెప్పుకుంటున్న వారని ఆదేశించారు. ఇదిలా ఉంటే స్వయంవరం రెవెన్యూ పరిధిలో 1984లో బంజరు భూములకు ఇచ్చిన డి పట్టాలను రద్దు చేశారని, కొంత మంది స్థానిక పదవీ విరమణ పొందిన రెవెన్యూ అధికారులు రికార్డులను టాంపరింగ్ చేసి దొంగ పట్టాలు సృష్టించి ప్రభుత్వ భూముల్లో సరుగుడు తోటలు పెంచుతూ లక్షల్లో సొమ్ములు వెనకేసుకుంటున్నారని స్థానికులు ఆరోపిస్తున్నారు. సుమారు 120 ఎకరాల్లో ప్రభుత్వ భూముల్లో రైతులు ముసుగులో సరుగుడు చెట్ల వ్యాపారం రెండు దశాబ్దాలుగా కొనసాగుతుందని ఈ వ్యవహారంపై రెవెన్యూ ఉన్నతాధికారులు సమగ్ర విచారణ జరిపి ప్రభుత్వ భూముల్లో సరుగుడు చెట్ల వ్యాపారాలు చేస్తున్న వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని, ప్రభుత్వ భూములను అక్రమార్కులు నుండి స్వాధీనం చేసుకోవాలని గ్రామస్తులు కోరుతున్నారు.

## రిలయన్స్ ఫౌండేషన్ అధ్వర్యంలో విధ్యార్థులకు ఉచితంగా మాస్కుల పంపిణి..

నందికొట్కూరు. ఏప్రిల్ 15 నందికొట్కూరు మండలం లోని జిల్లా పరిషత్తు ఉన్నత పాఠశాల కొణిదెల లో మిషన్ కొవిడ్ సురక్ష లో భాగంగా రిలయన్స్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో విద్యార్థిని, విద్యార్థులకు ఉచితంగా పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ప్రధాన ఉపాధ్యాయులు హనుమంతరావు మాట్లాడుతూ కోవిడ్ నిబంధనల ప్రకారం పాఠశాలల్లో మాస్కు ధరించడం ఖచ్చితమైన నేపథ్యంలో రిలయన్స్ ఫౌండేషన్ వారు విధ్యార్థులకు నాణ్యమైన మాస్కులు అందజేయడం ప్రశంసనీయం అని పేర్కొన్నారు. కరోనా నుంచి రక్షణకు ప్రతి ఒక్కరు మాస్క్ విధిగా ధరించాలని కోరారు.విధ్యార్థులకు మాస్కులు అందించడంలో తమ వంతు కృషి చేసిన పాఠశాల ఆంగ్ల ఉపాధ్యాయురాలు సిల్వియా రేచల్ ను ప్రధాన ఉపాధ్యాయులు అభినందించారు.ఈ కార్యక్రమంలో స్టాఫ్ సెక్రెటరీ నారాయణ రెడ్డి , ఫిజికల్ డైరెక్టర్ శ్రీనాథ్ , పాఠశాల ఉపాధ్యాయులు నీరజ , శ్రీనివాస రెడ్డి , శివప్రసాద్ , యళ్లన్న మరియు పాఠశాల విద్యార్థులు పాల్గొన్నారు.

## బాలింత మృతి?బంధువుల అందోళన

నర్సీపట్నంనర్సీపట్నం ఏరియా ఆస్పత్రిలో డాక్టర్ల నిర్లక్ష్యంతో బాలింత మృతి చెందడం తో బంధువులు ఆందోళన వ్యక్తం చేశారు.మెటర్నేటి వార్డు ముందు బైఠాయించి బంధువుల ఆందోళనకు దిగారు.డాక్టర్ పై వెంటనే చర్యలు తీసుకోవాలంటూ బంధువులు, నాయ కులు డిమాండ్ చేశారు.శిశువుకు జన్మనిచ్చి చికిత్స సరిగ్గా అందకపోవ డంతో బాలింతరాలు మృతిచెందిందంటూ బంధువుల ఆరోపణ చేశారు. ఆసుపత్రి వైద్యులు సిబ్బంది నిర్లక్ష్యం వల్లనే ఈ మృతికి కారణం గా కుటుంబ సభ్యులు ఆవేదన వ్యక్తం చేశారు.నర్సీపట్నం ఏరియా ఆసుపత్రిలో బాలింత మృతి చెందడంతో బంధువులు ఆందోళన చేస్తున్నారు. వైద్యుల నిర్లక్ష్యం వల్లే బాలింత మృతి చెందినట్లు బంధువులు ఆరోపిస్తున్నారు. గొలుగొండ గ్రామానికి చెందిన గర్భిణీ ఎస్. సంతోషి కుమారిని ప్రసవంకోసం బంధువులు నర్సీపట్నం ఏరియా ఆసుపత్రిలో చేర్పించారు. ఏరియా ఆసుపత్రి డాక్టర్ గౌతమి మహిళకు పెద్ద ఆపరేషన్ చేయడంతో ఆడపిల్లకు జన్మనిచ్చింది. బాలింత మృతికి డాక్టర్ గౌతమే కారణం అని కుటుంబ సభ్యులు ఆరోపించారు.

# ప్రాణాలైనా అర్పిస్తాం.. సాగు భూములు ఇవ్వము..

### భూమి కోసం మల్యాల రైతులు ఉద్యమం..

నందికొట్కూరు. ఏప్రిల్ 15. ( విభారె) హంద్రనీవా పేజ్ 2 నిర్మాణం కోసం ప్రభుత్వం బలవంతపు భూ సేకరణ పనులు నిలిపివేయాలని, తమ సాగు భూములను ప్రాజెక్ట్ నిర్మాణం కోసం ఇచ్చే ప్రసక్తి లేదని మల్యాల రైతులు స్పష్టం చేశారు. తమ వ్యవసాయ భూములను ప్రభుత్వం లాక్కుంటే చూస్తూ ఊరుకోబోమని తమ భూములను కాపాడుకోవడానికి అత్మబలి దానలకైన సిద్ధమంటూ రైతులు ఉద్యమం బాట పట్టారు. హంద్రీ నీవా భూ పోరాట కమిటిగా ఏకమయ్యారు. 1978లో నీరు నిల్వ కోసం 616 ఎకరాల భూమిని శ్రీశైలం ప్రాజెక్టు నిర్మాణం సందర్భంగా తీసుకున్నారు నీరు తగ్గిన తర్వాత మీ భూములను మీరు సాగు చేసుకోండని చెప్పారు. 98 జీవో ప్రకారం ఉద్యోగం ఇస్తామని హామీ ఇచ్చారు. గ్రామంలోని కొద్ది మంది కి మాత్రమే లస్కర్ పోస్టులు ఇచ్చి అరకొర నష్టపరిహారం చెల్లించి చేతులు దులుపుకున్నారు. 1981లో నందికొట్కూరు పట్టణానికి తాగునీటి కోసం దాదాపు 150 ఎకరాలు సేకరించారు. 2006లో హంద్రీనీవా కోసం 500 ఎకరాలు ముచ్చుమర్రి నుండి లింకు ఛానల్ కు మరో 500 ఎకరాల భూములు, పంప్ హౌస్, సబ్ స్టేషన్ పార్కింగ్ పేరుతో 150 భూములను ప్రభుత్వం లాక్కుంది. దాదాపు ఇప్పటివరకు రెండు వేల ఎకరాల దాకా రెండు కార్లు పంటలు పండే భూములు తీసుకున్నారు. రైతులు త్యాగాలు చేశారు .వీటి మూలంగా గ్రామంలో వ్యవసాయ కూలీలకు పని లేకుండా పోయింది ఒక నాడు అనేక గ్రామాల నుండి మల్యాల గ్రామానికి వందల మంది వచ్చి పని చేసుకోవడానికి ఉపాధి కల్పించిన గ్రామం నేడు గ్రామాన్ని చూపెట్టు కొని ఉన్న ప్రజలకు పనులు లేక వలస వెళ్ళే పరిస్థితి ఏర్పడిందన్నారు నేడు ఉన్న కొద్దిపాటి భూమిని హంద్రీనీవా ఫేస్ టు చానల్ ను ఏర్పాటు చేయాలనే పేరుతో గ్రామ రైతులకు తెలియకుండా సర్వే చేయడం విచారకరమన్నారు. ఉన్న భూములు పోవడం వల్ల గ్రామంలో ఉన్న రైతులు, కూలీలకు పనులు లేకుండా పోయే అవకాశం ఉంది. పశువులకు మేత దొరికే అవకాశం ఉండదని వారు తెలిపారు స్థానిక ఎమ్మెల్యే జిల్లా కలెక్టరు గ్రామ రైతులకు తగు న్యాయం చేయాలని వారు కోరారు. రైతులకు అన్యాయం జరిగితే సహించేది లేదని వారు తెలిపారు. ఈ కార్యక్రమంలో గ్రామ రైతులు సర్పంచ్ ఎల్ల నాయుడు, శ్రీనివాసులు గౌడ్ ,బోయ వెంకటరమణ, ఖాజా మోదిన్, గూడుసా, మంజు, హుస్సేన్ పీరా జమ్మన్న తదితరు లు పాల్గొన్నారు.

# ప్రజా విశ్వాసాన్ని కోల్పోయిన బీజేపీ, టీడీపీ, వైకాపాలు

### చింతామోహన్

తిరుపతి ( విభారె) బీజేపీ, టీడీపీ, వైకాపాలు రాష్ట్రాన్ని నాశనం చేస్తున్నాయని కాంగ్రెస్ పార్టీ అభ్యర్ధి చింతా మోహన్ ఆరోపించారు. నిరక్షరాస్యతను తగ్గించింది కాంగ్రెస్ అని అన్నారు. కరోనా, నిత్యావసర వస్తువుల ధరల పెరుగుదల సామాన్యులు భోజనం చేయలేని పరిస్థితి వుంది. బీజేపీ, టీడీపీ, వైకాపాలు ప్రజల విశ్వాసం కోల్పోయారు. జగన్ వేల కోట్ల రూపాయల దోచుకున్నాడు. వివేకానంద రెడ్డి మా అన్న కుమారుడు ఇబ్బంది పడుతున్నారని వాపోయాడు. జగన్ రాజకీయల్లో ఉండడానికి అర్హుడు కాదు. రాజకీయం అంటే త్యాగాలు చేసి, సేవ చేయాలి. ఇప్పుడు పార్టీలు దోచుకోవడానికి వస్తున్నాయి.. ప్రశ్నించేవారు లేరని అన్నారు.చెప్పులు లేని చంద్రబాబు వేల కోట్లు ఎలా సంపాదించారు. పేదల ఇళ్లు ఆపిన ఘనత చంద్రబాబుదే. పెయిడ్ న్యూస్ రాయింకుంటున్నారు. నెల్లూరులో ఒక మంత్రి 5 కోట్లు వసూలు చేశారు.. గూడూరు ఎన్నికల్లో పంపిణీకి. చంద్రబాబు 500 రూపాయలు పంచితే నీ పార్టీని రద్దు చేయమని ఎన్నికల సంఘాన్ని కోరుతాం. జగన్ 30 కోట్లు, చంద్రబాబు 20 కోట్లు ఖర్చు చేశారు.

అంతర్జాతీయ విమానాశ్రయంకు ఎందుకు విమానాలు రాలేదు. తెదేపా, వైకాపాలు గూడూరులో డబ్బులు ఎందుకు పంచుతున్నాయి. ప్రజాస్వామ్యానికి పునాదులు పోయే పరిస్థితి నెలకొంది. మోడీ, అమిత్ షా లు తప్పులపై తప్పులు చేశారని అన్నారు. ఎన్నికల తర్వాత పూర్తి ఆధారాలు బయటపెడతాననిఅన్నారు. .

# అన్యోన్య జీవితాన్ని చిదిమేసిన కరోనా మహమ్మారి

బెల్లంపల్లి నీకు నేను.. నాకు నువ్వు అని తోడునీడగా సాగిన వారి జీవితంలో కన్నీళ్లను మిగిల్చింది. భర్తకు కొవిడ్ సోకడం తట్టుకోలేని భార్య బలవన్మరణానికి పాల్పడిన ఘటన బెల్లంపల్లి పట్టణంలో విషాదాన్ని నింపింది. ఈ నెల మొదటి వారంలో లక్షెట్టిపేట మండలంలోని ఓ గ్రామానికి పెళ్లిచూపుల కోసం బెల్లంపల్లి పట్టణం హన్మాన్బస్తీకి చెందిన సుద్దాల మొండయ్య, ఆయన భార్య జలజ(54)తో పాటు కుటుంబసభ్యులంతా వెళ్లారు. మొండయ్యకు జ్వరం రావడంతో ఈ నెల 5న కరోనా పరీక్ష చేయించుకోగా పాజిటివ్ వచ్చింది. శ్వాస సమస్యలు ఉండడంతో బెల్లంపల్లి ఐసోలేషన్ కేంద్రంలో చేరారు. పరిస్థితి ఆందోళనగా మారడంతో కుటుంబసభ్యులు 7వ తేదీన హైదరాబాద్లోని ఓ ప్రైవేటు ఆసుపత్రికి తరలించారు. అదే రోజున భార్యతో పాటు కుమార్తె, చిన్న కోడలికి కొవిడ్ సోకింది. తర్వాత చిన్న కోడలికి నెగెటివ్గా నిర్ధారణ అయింది. భర్త కొవిడ్తో ఆసుపత్రిలో చేరడాన్ని భార్య జలజ తట్టుకోలేకపోయింది. తీవ్ర మానసిక ఒత్తిడితో ఉన్న ఆమె మంగళవారం అర్ధరాత్రి ఉరేసుకుని బలవన్మణానికి పాల్పడ్డారు. మొండయ్య సింగరేణి విశ్రాంత కార్మికుడిగా ఉన్నారు. మొండయ్య మొదటి భార్య చనిపోవడంతో జలజను రెండో పెళ్లి చేసుకున్నారు. మొదటి భార్యకు ముగ్గురు కుమారులు, ముగ్గురు కుమార్తెలు. వీరందరికి ఘనంగా పెళ్లిళ్లు చేశారు. జలజ పిల్లలందరినీ బాగా చూసుకునేదని స్థానికులు తెలిపారు. తండ్రి ఆసుపత్రిలో ఉన్న సమయంలో ఆమె ఆత్మహత్య చేసుకోవడంతో కుటుంబసభ్యులు కన్నీరుమున్నీరయ్యారు. కొవిడ్ నిబంధనల ప్రకారం మున్సిపల్ పారిశుద్ధ్య సిబ్బంది పోచమ్మగడ్డ శ్మశానవాటికలో కుటుంబసభ్యుల సమక్షంలో అంత్యక్రియలు నిర్వహించారు.భర్త పరిస్థితి ఆందోళనకరంగా ఉందని, ఏమైనా అవుతుందేమోననే బెంగతో జలజ ఆత్మహత్య చేసుకున్నారని పోలీసులు తెలిపారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు వివరించారు.

## సానుభూతి కోసం చంద్రబాబు ప్రయత్నం

తిరుపతి తిరుపతి ఉప పోరుపై మా సవాల్ ను టీడీపీ స్వీకరించలేదు. సమాధానం చెప్పాలేదని మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి అన్నారు. లేని రాళ్లు పడ్డాయని సింపతీ కోసం చంద్రబాబు ప్రయత్నం చేస్తున్నారు. పథకాలు ఇస్తున్నాం కాబట్టి...ధైర్యం గా వైసీపీ ఓట్లు అడుగుతున్నారని అన్నారు. రేపో మాపో టీడీపీ మూసేస్తారు. ఆ మాట పార్టీ నేతలే అంటున్నారు. గురుమూర్తి దళితుడు కాకపోతే నామినేషన్ తిరస్కరణ కు గురయ్యేది. కరెక్ట్ గా మెజారిటీ గురించి చెప్పలేమని అన్నారు. పోలింగ్ శాతం బాగుంటే మాకు ఆరు లక్షల పైన మెజారిటీ వస్తుంది.

# నిర్మాణ లోపాలను తొలగించాలా? ఈ జంతువులను పెంచండి



జంతువులు మన చుట్టూ ఉన్న ప్రతికూల శక్తులను నిర్మూలించడం ద్వారా వాస్తు దోషాల ప్రభావాన్ని తగ్గిస్తాయి, తద్వారా మన దారికి వచ్చే లేదా భవిష్యత్తులో మనపై ప్రభావం చూపే ఏవైనా ఇబ్బందులను విక్షేపం చేస్తుంది. చెట్లు మరియు మొక్కలే కాకుండా, ఇంట్లో సానుకూల శక్తిని విడుదల చేసే ఏకైక జీవులు ఇవి అని వాస్తుశాస్త్ర నిపుణులు చెబుతారు. అయినప్పటికీ, వారి శ్రేయస్సును కూడా నిర్ధారించడం మన బాధ్యత .ఇంట్లో ఉన్న నిర్మాణ లోపాలను తొలగించడానికి మరియు మీ జీవితంలో అదృష్టాన్ని తీసుకురావడానికి మీరు ఇంట్లో ఏ పెంపుడు జంతువులను ఉంచాలో తెలుసుకోవడానికి చదవండి. అలాంటి జంతువుల చిత్రాలు లేదా విగ్రహాలను ఇంట్లో ఉంచడం వల్ల మీకు ఎలాంటి లాభనష్టాలు ఉంటాయి. ఇప్పుడు మనం తెలుసుకుందాం..1. ఆవువాయువ్య దిశలో వాస్తు దోషం ఉంటే, దాన్ని వదిలించుకోలేము, ఆవును ఆరాధించడం వల్ల దాని చెడు ప్రభావాలు తగ్గుతాయి మరియు శాంతి, శ్రేయస్సు మరియు ఆనందం లభిస్తాయి. అదనంగా, పశ్చిమ దిశ నుండి గరిష్ట సానుకూల ప్రభావాలను పొందడానికి, నల్ల ఆవును ఆరాధించండి; ఎర్ర ఆవును తిరిగి మార్చడం దక్షిణానా నుండి అనుకూలతను పొందడానికి మీకు సహాయపడుతుంది – ముఖ్యంగా రాజకీయాలు, పరిపాలనా రంగం లేదా రియల్ ఎస్టేట్లో పాల్గొన్న వారికి. మీ ఇంటి నిర్మాణమే ఇబ్బందికి కారణమైతే, ఒక ఆవు మరియు దూడను 15 రోజులు ఉంచండి. వాస్తు దేవతను సంతోషంగా ఉంచడానికి మరియు శ్రేయస్సు తీసుకురావడానికి, ఇంధనం మరియు బియ్యం కోసం ఆవు పేడను, కర్పూరం మరియు నెయ్యిని ఉపయోగించి ఒక యజ్ఞాన్ని చేయండి.ప్రత్యామ్నాయం: మీరు ఇంట్లో ఒక ఆవును ఉంచే స్థితిలో లేకపోతే, దోషాలను దూరం చేయడానికి ఒక దూడతో ఉన్న ఒక వెండి ఆవు లేదా ఆవులతో శ్రీకృష్ణుని ఛాయాచిత్రం పొందండి.2. కుక్కప్రధాన ద్వారం నైరుతిలో ఉంటే లేదా మరుగుదొడ్డి తప్పు దిశలో ఉంటే, బ్రహ్మస్థానంకు అనుసంధానించబడిన సమస్యలు ఉంటే కుక్క ప్రయోజనకరంగా ఉంటుంది. పశ్చిమ దిశ వాస్తు నిబంధనల ప్రకారం కాకపోతే, నల్ల కుక్కను పెంచుకోండి.ప్రత్యామ్నాయం: మీరు ఇంట్లో కుక్కను పెంచుకోలేకపోతే, ప్రతికూల దోషాలను నిర్మూలించడానికి వీధి కుక్కలకు బిస్కెట్లు ఇవ్వండి.3. చిలుక, మేక మరియు తాబేలుఉత్తరాన వాస్తు సమస్యలు ఉంటే ఈ జంతువులు సహాయం చేస్తాయి; వ్యాపారంలో నష్టాలు; మీ కుమార్తె తన వైవాహిక ఇంటిలో సంతోషంగా లేకుంటే; లేదా పిల్లలు తమ కెరీర్లో విజయం సాధించడంలో ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.ప్రత్యామ్నాయం: సానుకూల శక్తిని పెంచడానికి చిలుక లేదా తాబేలు యొక్క ఛాయాచిత్రం లేదా శిల్పం ఉత్తర దిశలో ఉంచండి.. పిల్లి, కుందేలు మరియు పక్షిపిల్లి, కుందేలు లేదా పక్షిని ఉంచడం సౌత్ ఈస్ట్లో సానుకూలతను పెంచుతుంది మరియు కుటుంబంలోని మహిళల ఆరోగ్యాన్ని కూడా పెంచుతుంది మరియు ఇంటికి శ్రేయస్సు మరియు అదృష్టాన్ని తెస్తుంది. లక్ష్మి దేవికి చిహ్నంగా భావించే పిల్లులు ఇంటికి డబ్బు తెస్తాయి. తెల్ల పిల్లి సాధారణంగా ప్రజలు ఇష్టపడేది అయినప్పటికీ, నైరుతి దిశతో అనుసంధానించబడిన సమస్యలతో నలుపు మీకు సహాయం చేస్తుంది.ప్రత్యామ్నాయం: సౌత్ ఈస్ట్ దిశ నుండి దోషాలను తగ్గించడానికి విచ్చలవిడి పిల్లులకు ఆహారం ఇవ్వండి.5. గేదెమీరు నిరుద్యోగం లేదా ఎక్కువ కాలం పదోన్నతి లేకపోవడంతో బాధపబడుతుంటే; లేదా విదేశాలలో అధ్యయనం చేయడానికి మరియు పాడి వ్యాపారంలో శ్రేయస్సును కొనసాగించడానికి సున్నితమైన మార్గం అవసరం, గేదె వైపు తిరగండి. కానీ మీరు శనితో సంబంధం ఉన్నందున దానిని పశ్చిమ వైపు ఉంచాలి.ప్రత్యామ్నాయం: ఇంట్లో పశ్చిమ దిశలో ఒక గేదె విగ్రహాన్ని ఉంచండి.6. గుర్రంఎర్ర గుర్రం ఈశాన్య మరియు దక్షిణ ప్రాంతాల నుండి వాస్తు దోషంను నిర్మూలిస్తుంది; మరియు మీ గౌరవాన్ని మరియు సమాజంలో నిలబడటానికి సహాయపడుతుంది. నైరుతిలో లోపాల కోసం, తెల్ల గుర్రాన్ని పొందండి. సరిగ్గా ఉంచాల్సిన తూర్పు మరియు పడమర దిశలలో సమస్యలు ఉంటే, నల్ల గుర్రం సహాయం తీసుకోండి.ప్రత్యామ్నాయం: ప్రవేశద్వారం వద్ద లేదా ఇంటి లోపల గుర్రపు విగ్రహాన్ని ఉంచండి. మీరు సానుకూల శక్తిని పొందడంలో సహాయపడటం వలన దక్షిణ దిశగా ఉన్న గోడపై తూర్పు లేదా ఉత్తర దిశలలో నడుస్తున్న గుర్రాల ఛాయాచిత్రాన్ని కూడా మీరు పరిష్కరించవచ్చు.7. ఏనుగుపురాతన కాలంలో, అతను కలిగి ఉన్న ఏనుగుల సంఖ్య రాజు యొక్క గొప్పతనాన్ని అంచనా వేసింది. ఏనుగు రాహుతో అనుసంధానించబడినందున, ఇది నైరుతి దిశలో వాస్తు దోష యొక్క చెడు ప్రభావాలను తగ్గించడంలో సహాయపడుతుంది.ప్రత్యామ్నాయం: ఈ రోజుల్లో ఏనుగును ఉంచడం అసాధ్యం, కావున, మీరు నైరుతిలో మట్టి విగ్రహాన్ని ఉంచవచ్చు; దక్షిణాన ఎర్ర రాయి ఒకటి; లేదా పశ్చిమాన పాలరాయి విగ్రహం. మీరు మీ స్థానంలో తెల్ల రాతి ఏనుగు విగ్రహాన్ని కూడా ఉంచవచ్చు.

## కరోనా కేసులు ఇలాగే పెరిగితే ఒలింపిక్స్ రద్దు

టోక్యో: ఒలింపిక్స్కు మరోసారి కరోనా గండం పట్టుకుంది. జపాన్లో కేసుల సంఖ్య పెరిగితే, గేమ్స్ నిర్వహించడం సాధ్యం కాకపోతే రద్దు చేసేస్తామని ఆ దేశ అధికార పార్టీ ప్రధాన కార్యదర్శి తొషిహిరొ నికాయ్ స్పష్టం చేశారు. ఒలింపిక్స్ వల్ల ఇన్ఫెక్షన్లు పెరిగితే.. ఇక ఆ గేమ్స్ ఎందుకు అని ఆయన ప్రశ్నించారు. జపాన్ అధికార పార్టీ అయిన లిబరల్ డెమొక్రటిక్ పార్టీకి ప్రధాన కార్యదర్శి ఆయన. ఆ పార్టీలో రెండో అత్యంత శక్తివంతమైన నేత నికాయ్.ఓ టీవీ కార్యక్రమంలో భాగంగా ఆయన ఈ వ్యాఖ్యలు చేశారు. ఒలింపిక్స్ను విజయవంతం చేయాలని తాము కూడా భావిస్తున్నామని, అయితే అంతకుముందు పరిష్కరించాల్సిన సమస్యలు చాలా ఉన్నాయని నికాయ్ అన్నారు. గతేడాది జరగాల్సిన ఒలింపిక్స్ను కరోనా కారణంగా ఈ ఏడాదికి తరలించారు. జులై 23న గేమ్స్ ప్రారంభం కావాల్సి ఉన్నాయిఅయితే అందుకు సరిగ్గా 99 రోజులు ముందు నికాయ్ ఈ వ్యాఖ్యలు చేయడం గమనార్హం. జపాన్లోని ఒసాకాలో ఈ మధ్య భారీగా కేసులు నమోదవుతున్నాయి. దీంతో ఈ మధ్యే ఎత్తేసిన ఎమర్జెన్సీని మళ్లీ విధించారు. దీంతో ఇక్కడ జరగాల్సిన ఒలింపిక్ టార్చ్ రిలే రద్దయింది. మరోవైపు ఒలింపిక్స్ నిర్వాహకులు మాత్రం గేమ్స్ను కొవిడ్ నిబంధనల మధ్య విజయవంతంగా నిర్వహించవచ్చని అంటున్నారు. అయితే అందుకు విరుద్ధంగా జపాన్ ప్రజల్లో చాలా మంది గేమ్స్ నిర్వహణను వ్యతిరేకిస్తున్నారు. తాజాగా ఒపినియన్ పోల్లో మెజార్టీ ప్రజలు గేమ్స్ను రద్దు లేదా వాయిదా వేయాలని డిమాండ్ చేశారు.

# సీనియర్ స్టార్ హీరోల సరసన మీనా జోరు!




వెండితెరకి చైల్డ్ ఆర్టిస్ట్ గా పరిచయమై .. ఆ తరువాత స్టార్ హీరోయిన్ గా ఎదిగినవాళ్లను వ్రేళ్లపై లెక్కపెట్టవచ్చు. ఆ కేటగిరిలో శ్రీదేవి తరువాత స్థానంలో మీనా కనిపిస్తుంది. నిజానికి మీనా ఇండస్ట్రీకి కథానాయికగా వచ్చేటప్పటికి గట్టి పోటీ ఉంది. అయినా పెద్దగా స్కిన్ షో చేయకుండా మంచి క్రేజ్ ను తెచ్చుకుంది. మీనా అనే పేరు వినగానే కొత్త పెళ్లి కూతురు మాదిరిగా సిగ్గుపడిపోయే ఆమె రూపమే ఇప్పటికీ అభిమానుల కళ్లలో కదులుతుంది .. మెదులుతుంది. తెలుగులోనే కాదు .. తమిళంలోనూ ఆమె అదే జోరు చూపించింది.తెలుగు .. తమిళ భాషల్లోని స్టార్ హీరోలందరితోను మీనా ఆడిపాడింది. వరుస హిట్లను తన ఖాతాలో వేసుకుంది. అలాంటి మీనా వివాహమైన తరువాత కూడా పెద్దగా గ్యాప్ తీసుకోలేదు. తనకి నచ్చిన పాత్రలను నిదానంగా అంగీకరిస్తూ .. నింపాదిగా చేస్తూ వస్తోంది. తన వయసుకి తగినట్టుగానే సీనియర్ హీరోల సరసన నాయికగా నటిస్తోంది. మలయాళంలో మోహన్ లాల్ సరసన cదృశ్యంc చేసిన ఆమె తెలుగులో అదే సినిమాలో వెంకటేశ్ సరసన నాయికగా నటించింది. ఆ సినిమా సీక్వెల్ లోను అదే పరిస్థితి.ఇక గతంలో రజనీకాంత్ తో మీనా చేసిన సినిమాల్లో cముత్తుc ముందువరుసలో కనిపిస్తుంది. కథాకథనాల పరంగా .. సంగీతం పరంగా ఈ సినిమా ఒక ఊపు ఊపేసింది. గ్లామర్ పరంగా కూడా ఈ సినిమా మీనాకి ఎక్కువ మార్కులు తెచ్చిపెట్టింది. మళ్లీ ఇప్పుడు రజనీ సరసన నాయికగా cఅన్నాత్తేc సినిమాలో కనిపించనుంది. నవంబర్ 4వ తేదీన ఈ సినిమా ప్రపంచవ్యాప్తంగా విడుదల కానుంది. ఈ సినిమా రిలీజ్ తరువాత మీనా జోరు పెరిగే అవకాశాలు పుష్కలంగా ఉన్నాయనే టాక్ వినిపిస్తోంది. ఇక తెలుగులో చిరంజీవి రీమేక్ చేయనున్న ఓ సినిమాలోను మీనా పేరు వినిపిస్తోంది. మొత్తానికి మీనా మూడు భాషల్లోని సీనియర్ స్టార్ హీరోల సరసన నటిస్తూ ఇప్పటికీ అదే గ్రాఫ్ ను కొనసాగిస్తూ ఉండటం విశేషం.

## cమేజర్c ప్రతి మనిషికి నచ్చే మూవీ: హీరో అడవిశేష్


ప్రస్తుతం చిత్రపరిశ్రమలో బయోపిక్స్ కాలం నడుస్తుంది. అందులో భాగంగానే ఇండియాలో ఫేమస్ పర్సనాలిటీల లైఫ్ స్టోరీలను సినిమాల రూపంలో ప్రేక్షకుల ముందుకు తీసుకొస్తున్నారు మేకర్స్. టాలీవుడ్ యువహీరో అడవిశేష్ ప్రస్తుతం cమేజర్c అనే సినిమాలో నటిస్తున్న సంగతి తెలిసిందే. పాన్ ఇండియా సినిమాగా తెరకెక్కుతున్న మేజర్ మూవీ జులై 2న విడుదల చేయనున్నట్లు మేకర్స్ ప్రకటించారు. ఉగాది స్పెషల్ కావడంతో తాజాగా మేకర్స్ టీజర్ రిలీజ్ చేశారు. కానీ మేజర్ టీజర్ మూడు భాషల్లో ముగ్గురు సూపర్ స్టార్స్ రిలీజ్ చేయడం విశేషం. ప్రస్తుతం మేజర్ టీజర్ కు మంచి రెస్పాన్స్ రావడంతో చిత్రబృందం సమావేశం ఏర్పాటు చేసింది. ఈ సందర్భంగా సినిమా గురించి ఒక్కొక్కరుగా మాట్లాడారు.దర్శకుడు శశికిరణ్ మాట్లాడుతూ.. మేజర్ జర్నీ శేష్ నుండే స్టార్ట్ అయ్యింది. నన్ను ఈ ప్రాజెక్ట్లోకి శేష్ తీసుకొచ్చాడు. మొదట్లో ఈ మూవీ చేయొద్దనుకున్నా. కాని శేష్ సందీప్ గురించి చెప్పినప్పుడు తర్వాత వారి తల్లిదండ్రులను వెళ్లి కలిసినప్పుడు ఇది చెప్పకపోతే తప్పు అవుతుందని భావించాను. సందీప్ ఉన్ని కృష్ణన్ జీవితం నన్ను నన్ను కదిలించిన ఇన్స్పైర్ చేసిన విధానం ఈ సినిమాతో రెండేళ్లు జర్నీ చేయించింది. నా లైఫ్ లాంగ్ ఈ మూవీ గురించి చాలా గర్వంగా చెప్పుకుంటాను అన్నాడు. అనంతరం హీరోయిన్ సాయి మంజ్రేకర్.. cఈ మూవీ షూటింగ్ చాలా ఫన్నీగా జరిగింది. ఈ సినిమా నా దగ్గరకు వచ్చినప్పుడు ఫస్ట్ మా పేరెంట్స్ తప్పకుండా చేయాలని చెప్పారు. వాళ్ల సపోర్ట్ తోనే ఈ మూవీ చేయగలిగాను. ఈ మూవీ ఒక గ్రేట్ లెర్నింగ్ ఎక్స్పీరియన్స్c అని చెప్పింది.మరో హీరోయిన్ శోభిత మాట్లాడి.. ఈ టీమ్ తో గూడఛారి మూవీ షూట్ చేశా. అందుకే ఈ టీమ్తో మంచి బంధం ఏర్పడింది. మేజర్ మూవీలో భాగమవడం చాలా గర్వంగా ఉందంది. అలాగే నిర్మాత శరత్.. ఇది ఒక థియేట్రికల్ ఎక్స్పీరియన్స్ మూవీ. మాకు సపోర్ట్ చేసిన నమ్రత మేడమ్ మహేష్ సర్కి థ్యాంక్స్. అలాగే సోనీ పిక్చర్స్ వారు మాతో భాగస్వామ్యం అవడం హ్యాపీగా ఉందన్నారు.

# సీక్రెట్ ఏజెంట్ పాత్రలో చోప్రా బ్యూటీ..!



బాలీవుడ్ స్టార్ హీరోయిన్ పరిణితి చోప్రా.. మరో లేడీ ఓరియెంటెడ్ మూవీలో నటించేందుకు సిద్ధం అవుతోందట. డైరెక్టర్ రిభూ దాస్గుప్తా తెరకెక్కించనున్న యాక్షన్ థ్రిల్లర్లో పరిణీతి చోప్రా అండర్ కవర్ ఏజెంట్ పాత్రను పోషించనుంది. డైరెక్టర్ రిభూతో పరిణితి గతేడాది cది గర్ల్ ఆన్ ది ట్రైన్c అనే సినిమా చేసింది. ఆ సినిమా ఓటిటిలో విడుదలై మంచి వ్యూయర్ షిప్ దక్కించుకోవడంతో ఈ స్టార్ – డైరెక్టర్ కాంబినేషన్ లో రెండో సినిమాకు ప్రణాళిక సిద్ధం అవుతోంది. తాజా సమాచారం ప్రకారం.. ఇంకా పేరు పెట్టని ఈ యాక్షన్ థ్రిల్లర్ మూవీలో పరిణితి చోప్రా ఎన్ఐఏ ఏజెంట్ పాత్రలో కనిపించనుంది. ఇండియన్ సీక్రెట్ ఏజెంట్స్ కోవర్ట్ ఆపరేషన్ చుట్టూ ఈ కథ తిరుగుతుందని టాక్.రిభూ దాస్గుప్తా దర్శకత్వం వహించనున్న ఈ విమెన్ సెంట్రిక్ మూవీలో పరిణీతి చోప్రా బలమైన పాత్ర పోషించనుంది. ప్రస్తుతం ఈ సినిమా పై పలు ఊహగానాలు వ్యక్తం అవుతుండగా మేకర్స్ క్లారిటీ ఇచ్చే ప్రయత్నం చేశారు. cఈ సినిమా భారతదేశం – పాకిస్తాన్ నేపథ్యంలో కాదు. ఈ చిత్రంలో పరిణీతి ఒక రహస్య ఏజెంట్. ఆమెనే సీక్రెట్ ఆపరేషన్కు నాయకత్వం వహిస్తుంది. ఈ చిత్రంలో కేవలం ఓ మహిళ ప్రయాణం అలాగే పగను మాత్రమే చూపించనున్నాముc అని చెప్పారు. ఇంకా పూర్తి వివరాలు తెలియాల్సి ఉండగా.. త్వరలోనే సినిమా పట్టాలెక్కనుందని బాలీవుడ్ వర్గాలు చెబుతున్నాయి.

# నిర్మాతగా మరో స్టార్ హీరో..? మలయాళ హీరోతో తొలి ప్రయత్నం..?



ప్రస్తుతం టాలీవుడ్ లో హీరోలు నిర్మాతలు అంటూ సెపరేట్ గా లేరు. ఎందుకంటే ఇప్పుడున్న హీరోలందరూ ప్రొడ్యూసర్స్ గా మారి సినిమాల నిర్మాణంలో భాగం పంచుకుంటూ వస్తున్నారు. అక్కినేని నాగార్జున (అన్నపూర్ణ స్టూడియోస్) – నందమూరి బాలకృష్ణ (చీదీఖ ఫిలిమ్స్) – మహేష్ బాబు (+వీదీ ఎంటర్టైన్మెంట్) – రామ్ చరణ్ (కొణిదెల ప్రొడక్షన్స్) – పవన్ కళ్యాణ్ (పవన్ కళ్యాణ్ క్రియేటివ్ వర్క్స్) – సందీప్ కిషన్ (వెంకటాద్రి టాకీస్) – మంచు విష్ణు (24 ఫ్రేమ్స్ ఫ్యాక్టరీ ఏవీఏ ఎంటర్టైన్మెంట్) – కళ్యాణ్ రామ్ (ఎన్టీఆర్ ఆర్ట్స్) – విజయ్ దేవరకొండ (కింగ్ ఆఫ్ ది హిల్) – నాని – రానా దగ్గుబాటి – సుధీర్ బాబు – నితిన్ వంటి హీరోలు నిర్మాతలుగా మారి సినిమాలు నిర్మించారు. ఈ క్రమంలో మాస్ మహరాజా రవితేజ కూడా సినిమా ప్రొడక్షన్ లోకి దిగుతున్నాడని ఇండస్ట్రీ వర్గాల్లో టాక్ వినిపిస్తోంది.సినీ ఇండస్ట్రీలో ఎలాంటి బ్యాగ్రౌండ్ లేకుండా అడుగుపెట్టిన రవితేజ.. తనదైన నటనతో ప్రేక్షకులు మాస్ మహారాజా అని పిలుచుకునే స్థాయికి ఎదిగారు. గత రెండు దశాబ్దాలుగా హిట్ ఫ్లాప్ లతో సంబంధం లేకుండా వరుస సినిమాలు చేస్తూ బిజీగా గడుపుతున్నారు. ఈ క్రమంలో సొంతంగా ప్రొడక్షన్ హౌస్ స్టార్ట్ చేయాలనే ఆలోచనలో రవితేజ ఉన్నాడని టాక్ నడుస్తోంది. తన అభిరుచికి తగిన సినిమాలు – కంటెంట్ ఓరియెంటెడ్ సినిమాలు నిర్మించాలని చేస్తున్నాడట. ఈ నేపథ్యంలో ఓ మలయాళ హీరోతో సినిమా చేయడానికి సన్నాహాలు జరుగుతున్నాయని ప్రచారం జరుగుతోంది. ఇందులో నిజమెంతో తెలియాలంటే ఇంకొన్నాళ్లు ఆగాల్సిందే. ఇకపోతే cక్రాక్c సినిమాతో బ్లాక్ బస్టర్ హిట్ కొట్టి కోవిడ్ సమయంలో ఇండస్ట్రీకి ధైర్యాన్నిచ్చిన రవితేజ.. ప్రస్తుతం cఖిలాడిc అనే హై వోల్టేజ్ యాక్షన్ సినిమాలో నటిస్తున్నాడు.

EDITED, PRINTED,PUBLISHED AND OWNED BY **AVULA VIJAYA BHASKARA REDDY** PRINTED AT **SRI SANTOSH PRINTERS SHOP NO. 67-58/A2,OPP TAMIL NADU MERCANTILE BANK, OLD BUSTAND, KURNOOL- 518 001. ANDHRA PRADESH.**
**PUBLISHED FROM AVULA HUSSAIN REDDY COLONY,7-5-230, NANDYAL ROAD ALLAGADDA-518 543. KURNOOL DISTRICT. ANDHRA PRADESH. EDITOR : AVULA VIJAYA BHASKARA REDDY. RNI No : APTEL/2019/77190**